Follow: @ANNTELUGU
27-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 149 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహానాడుకు సర్వం సిద్ధం

- హైబ్రిడ్ పద్ధతిలో డిజిటల్ వేదికగా ఏర్పాటు
- నేడు, రేపు పసుపుపండుగ

**మంగళగిరి, మహా :** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' కార్యక్రమం ఈసారి సరికొత్త రూపంలో జరగనుంది. దేశ రాజకీయాల్లోనే ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతూ, మే 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కేంద్ర కార్యాలయం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్లకు డిజిటల్ సాంకేతికత ద్వారా అనుసంధానించి, లక్షలాది మంది కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నారు. 'స్త్రీశక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ మహానాడు మిగితా 2వ పేజీలో

టాప్ న్యూస్

### శంషాబాద్‌లో రూ.1000 కోట్ల భూ కుంభకోణం



- 170 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాహా
- నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ స్థలం ప్రైవేటు పరం ఎలా అయ్యింది?.
- తక్షణమే సిట్ లేదా సీఐడీతో విచారణ జరిపించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్.

02


### పోలీసు కస్టడీకి బండి భగీరథ్



- అనుమతించిన మల్కాజిగిరి కోర్టు
- థర్డ్ డిగ్రీ ప్రయోగించవద్దు, ఎలాంటి ఒత్తిడిలు చేయొద్దు
- షరతులు విధించిన న్యాయస్థానం

02

### డీజీపీని కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్



- ఏపీ పోలీసులు నోటీసులు ఇవ్వలేదు

02

## ధాన్యంపై రాజకీయం



### కేంద్రం కొనడం లేదన్న రాష్ట్రం

- అయినా గత ఏడాదికి మించి కొనుగోళ్ళు
- ఇంకా కొనసాగుతున్న కొనుగోళ్ళు కళ్ళాల్లో బీజేపీ యాత్ర.. మంత్రి ఉత్తమ్ ధ్వజం
- కేంద్రం నిర్లక్ష్యంగా ఉండి ఇక్కడ యాత్రలు చేయడమేంటని ఫైర్


02



## ఢిల్లీకి సిద్దరామయ్య?

### రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఆఫర్

- సీఎం మార్పుపై చర్చ జరగలేదన్న కేసీ వేణుగోపాల్
- కర్నాటకం.. ఆసక్తికరం



**ఢిల్లీ, మహా** : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కాంగ్రెస్ అధిష్టానం మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా

మిగితా 2వ పేజీలో



### గ్రామ పంచాయతీ సిబ్బందికి
## గుడ్‌న్యూస్

- ఇక ఐఏఎస్‌లతో సమానంగా ఒకటో తేదీనే జీతాలు!
- ప్రతి నెలా రూ. 50 కోట్లు ప్రత్యేకంగా మంజూరు
- జీతాల చెల్లింపులు ఒక్కరోజు ఆలస్యమైనా అధికారులపై కొరడా
- ట్రెజరీకి బదులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే పంచాయతీల సొంత ఆదాయం.
- పోస్టాఫీసుల ద్వారా కాకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా పించన్లు.
- సీఎం రేవంత్‌రెడ్డి సంచలన నిర్ణయం.

02



# పోలీసు కస్టడీకి బండి భగీరథ్



**హైదరాబాద్, మహా** : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో భగీరథ్‌ను మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు సమర్థించింది. నిందితుడిని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ్‌పై నమోదైన తీవ్రమైన ఆరోపణల కారణంగా మరిన్ని ఆధారాలు సేకరించడానికి పోలీసులు కస్టడీని కోరారు. ఈ మూడు రోజుల వ్యవధిలో ఘటన జరిగిన తీరు, ఇతరు ప్రమేయాలు, సాంకేతిక ఆధారాలపై పోలీసులు దృష్టి సారించనున్నారు. ఇప్పటికే బాధితురాలి నుండి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిని ప్రశ్నించి, కీలక విషయాలను వెలికితీయాలని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. కోర్టు ఆదేశాల ప్రకారం, బుధవారం నుండి భగీరథ్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. విచారణ సమయంలో నిందితుడిపై ఎటువంటి ఒత్తిడి గానీ, థర్డ్ డిగ్రీ గానీ ఉపయోగించకూడదని కోర్టు నిబంధనలు విధించింది. అలాగే ప్రతిరోజూ విచారణ ముగిసిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ విచారణలో వెల్లడయ్యే అంశాలు కేసు తుది తీర్పులో అత్యంత కీలకం కానున్నాయి. మరోవైపు, ఈ కేసు రాజకీయంగా కూడా సున్నితమైనది కావడంతో నేపథ్యంలో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కస్టడీ సమయంలో భగీరథ్‌కు సంబంధించిన మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం భగీరథ్ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కస్టడీ గడువు ముగిసిన తర్వాత తిరిగి ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసు కావడంతో పోలీసులు అత్యంత పకడ్బందీగా ఛార్జ్‌షీట్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

# ఢిల్లీకి సిద్ధరామయ్య?

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, కర్ణాటకలో అధికార మార్పిడికి సంబంధించిన అంశంపై సమావేశంలో ఎలాంటి చర్చా జరగలేదన్నారు. త్వరలో జరగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే సమావేశంలో చర్చ జరిగినట్టు చెప్పారు. 'కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. ఈ సమావేశంలో కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశాలే చర్చించాం. కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించాం' అని చెప్పారు. చర్చలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక ఇన్‌చార్జి, తాను పాల్గొన్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా రాజ్యసభ సీట్ల ఎన్నికలను ప్రకటించారని, దానిపైనే ఈరోజు చర్చించామని, తక్కినవన్నీ ఊహాగానాలేనని వివరించారు.



**సిద్ధరామయ్యకు ఢిల్లీ ఆఫర్**

కాగా కేసీ వేణుగోపాల్ ప్రకటనకు భిన్నంగా చర్చలు జరిగాయని, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై చర్చ మర్మం ఇదేనని ఢిల్లీవర్గాలలో ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పుకుని రాజ్యసభ ద్వారా ఢిల్లీకి వెళ్లాలని పార్టీ హైకమాండ్ కోరినట్లుగా కాంగ్రెస్ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో సిద్ధరామయ్యకు మరింత ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని , రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాలని హైకమాండ్ సిద్ధరామయ్యను కోరినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఇతర విషయాలు, సమస్యలు తాము చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కేవలం రాజ్యసభ ఎన్నికల అంశంపైనే చర్చించామనే కేసీ వేణుగోపాల్ ప్రకటన వెనుక సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపే వ్యూహం ఉందన్న చర్చ ఉంది. 2028 ఎన్నికల కోసం డీకే శివకుమార్ ను సీఎంగా చేయాలన్న ప్రతిపాదనపై పార్టీ సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు వినబడుతోంది. 2028, 2029 ఎన్నికలు లక్ష్యంగా డీకేకు ప్రియాంక మద్దతు ఉన్నట్లు వినబడుతోంది.

## ఏసీబీకి చిక్కిన ఎంఆర్వో సుచరిత



**శామీర్ పేట, మహా** : మరో అవినీతి తిమింగలం ఏసీబీకి చిక్కింది. హైదరాబాద్: ఏసీబీ అధికారులకు శామీర్ పేట్ ఎమ్మెఆర్వో సుచరిత రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూమి నాలా కన్వెర్షన్‌కి సుచరిత ఎకరాకు లక్షరేట్ కార్డ్ ఫిక్స్ చేశారు. 30ఎకరాల భూమి కన్వెర్షన్‌కి 30లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా అడ్వాన్స్‌గా సుచరిత కారు డ్రైవర్ రూ.2లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బును సుచరితకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. డబ్బు గురించి ప్రశ్నింగా సుచరిత, ఆమె డ్రైవర్ నీళ్లు నమిలారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు

# శంషాబాద్‌లో రూ.1000 కోట్ల భూ కుంభకోణం



**హైదరాబాద్, మహా.** : శంషాబాద్ మండలంలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన 170 ఎకరాల ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హామీలు నెరవేర్చడం, ధాన్యం కొనుగోలు చేయడం చేతకాని పాలకులు భూ కబ్జాలకు మాత్రం వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారం వెనుక సీఎంకు సన్నిహితుడైన ఓ ప్రభుత్వ పెద్ద హస్తం ఉందని, వెంటనే సిట్ లేదా సీఐడీతో విచారణ జరిపించి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 173 నుంచి 183 మధ్య ఉన్న సుమారు 170 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి అక్రమార్కులు భారీ స్కెచ్ వేశారని హరీశ్‌రావు ఆరోపించారు. వాస్తవానికి ఆ భూమి ప్రభుత్వానిదేనని, అది ఆక్రమణకు గురి కాకుండా వెంటనే నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టాలని ఆర్డీవో గతంలోనే తహశీల్దార్‌ను ఆదేశించారని గుర్తు చేశారు. ఇదే విషయాన్ని 2026 జనవరి 30న హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో సైతం స్పష్టంగా పొందుపరిచారని తెలిపారు. ఆ తర్వాత 2026 ఫిబ్రవరి 24న సదరు తహశీల్దార్ కూడా అది ప్రభుత్వ భూమిగా తేల్చారని, కానీ ఆశ్చర్యకరంగా సరిగ్గా నాలుగు రోజుల తర్వాత, అంటే ఫిబ్రవరి 28వ తేదీన అదే తహశీల్దార్ ఆ భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందుతుందంటూ ఆర్డర్ పాస్ చేశారని విమర్శించారు. కేవలం నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ భూమి ప్రైవేటు ప్రాపర్టీగా ఎలా మారుతుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ అక్రమ వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్నారు. ఆర్డీవో, తహశీల్దార్ వేర్వేరు రిపోర్టులు ఇచ్చినప్పుడు జీపీ రెవెన్యూ హైకోర్టుకు ఆ నివేదికను ఎలా సమర్పించారని అన్నారు. ఏ ఆర్డర్ అయినా జిల్లా కలెక్టర్ అప్రూవల్‌తోనే హైకోర్టుకు వెళ్తుందని, అలాంటప్పుడు కలెక్టర్, అడ్వకేట్ జనరల్ (ఏజీ) దీన్ని ఎలా అప్రూవ్ చేశారో సమాధానం చెప్పాలన్నారు. చట్ట ప్రకారం ఒక భూమిని 'భూ భారతి' ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలంటే దరఖాస్తు పెట్టుకున్న తర్వాత ఆర్డీవో అప్రూవ్ చేయాల్సి ఉంటుందని, కానీ ఈ కేసులో ఎమ్మార్వో చెప్పగానే అక్రమంగా ఎంట్రీ అయిపోయిందని మండిపడ్డారు. ఇంత పెద్ద కుంభకోణం పత్రికల్లో వచ్చిన తర్వాత ఏసీబీ అధికారులు దాడులకు వెళ్లారని, కానీ ఓ పెద్దాయన ఒత్తిడి వల్లే వారు ఖాళీ చేతులతో వెనక్కి వచ్చేశారని ఆరోపించారు. చర్యల పేరుతో ఎమ్మార్వోను కేవలం కలెక్టరేట్‌కు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని, భూమిని మాత్రం మ్యుటేషన్ చేసుకున్నారని ధ్వజమెత్తారు.

## డీజీపీని కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్



**ఏపీ పోలీసులు నోటీసులివ్వలేదు**


**హైదరాబాద్**: తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఏపీ పోలీసులు తనకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు.

# ధాన్యంపై రాజకీయం



చివరి గింజ వరకు కొంటాం- మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో పండిన ప్రతి వరి గింజనూ సేకరించి రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి పూర్తిగా ముఖం చాటేసిందని రాష్ట్రప్రభుత్వం ఫైర్ అవుతోంది. అయినా సరే అన్నదాతను ఆదుకోవడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగుతోంది. కేంద్రం నుంచి ఆశించిన సహకారం అందకపోయినా.. గత ఏడాది కంటే రికార్డు స్థాయిలో, ఏకంగా ₹5,000 కోట్లు అదనంగా ఖర్చు చేస్తూ ధాన్యం కొనుగోళ్లను ఉధృతంగా కొనసాగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 54 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి చేసి, 48 గంటల్లోనే నిధులు జమ చేస్తూ ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించింది. కేంద్రంలోని తమ ప్రభుత్వం చేయాల్సిన కనీస బాధ్యతను విస్మరించి, రాష్ట్రంలో బీజేపీ నాయకులు కళ్లాల వద్దకు 'యాత్రల' పేరిట వస్తున్నారంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిజానికి తెలంగాణలోని 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రమే కొనాలి.. కానీ అక్కడ చేతులెత్తేసి, ఇక్కడ కళ్లాల్లో రాజకీయం చేయడం సిగ్గుచేటు" అంటూ మంత్రి నిప్పులు చెరిగారు. కేంద్రం నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీజేపీ ఈ డ్రామాలకు తెరలేపిందని మండిపడ్డారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ఈ స్థాయిలో ధాన్యం కొంటున్నారా అని ఆయన సవాల్ విసిరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని, ఇందులో ఎలాంటి జాప్యం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, రైతులు వాటిని నమ్మవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.




# గ్రామ పంచాయతీ సిబ్బందికి గుడ్‌న్యూస్



**హైదరాబాద్, మహా** : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ఊరటనిచ్చారు. ఏళ్ల తరబడి వేతనాల కోసం ఎదురుచూస్తున్న కార్మికుల కష్టాలకు చెక్ పెడుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీనే కచ్చితంగా జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. అత్యున్నత స్థాయిలోని ఐఏఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు ఎలాగైతే అందుతున్నాయో, క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అదే రీతిలో ఒకటో తేదీనే వేతనాలు అందాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి నెలా రూ. 50 కోట్లను ప్రత్యేకంగా మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ ఎలాంటి తేడా లేకుండా ప్రతి నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సిబ్బందికి జీతాలు చెల్లించడంలో ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది లేదని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో వేలాది మంది కార్మికుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది.

గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని కాపాడే దిశగా సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీల సొంత ఆదాయంపై (ఓన్ సోర్స్ రెవెన్యూ) వాటికున్న స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను తక్షణమే రద్దు చేసి, తిరిగి పాత విధానాన్ని పునరుద్ధరించేందుకు ఆయన అంగీకారం తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 లోని సెక్షన్ 70(3)కు ప్రతిపాదిత సవరణలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సవరణల ద్వారా ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా, నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునే వెసులుబాటు కలగనుంది. దీనివల్ల నిధుల వినియోగంలో పంచాయతీలకు స్వేచ్ఛ లభించి, గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.

రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ విధానంపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న పెన్షన్ల విధానాన్ని మార్చి, ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్ డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. అనర్హులకు చెక్ పెట్టి, నిజమైన అర్హులకే పెన్షన్లు అందేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇందుకోసం ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, ఎస్ఈసీసీ డేటా ప్రాతిపదికన పెన్షన్ల పంపిణీ విధానాన్ని పూర్తిగా స్ట్రీమ్ లైన్ చేయాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, భవిష్యత్తులో కొత్తగా మంజూరు చేసే పెన్షన్లలో ఒంటరి మహిళలకు

## ఏపీలో నిప్పుల కొలిమి.

*** మరో నాలుగు రోజులు వడగాలులు.**
*** ఉగ్రరూపం దాల్చిన భానుడు.**
*** రాష్ట్రంలో భగభగలు.**

**అమరావతి, మహా.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్షరాలా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు. రానున్న నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వడగాలుల తీవ్రత అత్యంత దారుణంగా ఉంటుందని, ప్రజలు ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకునేందుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ శాఖ ఏపీ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. ఇప్పటికే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఏపీ ప్రజలకు ఈ తాజా వడగాలుల ముప్పు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మండుతున్న ఎండలకు తోడు తోలగని ఉక్కపోతలతో సామాన్యులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే వణికిపోయే భయానక పరిస్థితులు దాపురించాయి.



# ప్రతి పౌరుడికీ పబ్లిక్ వైఫై

**కేంద్రమంత్రి పెమ్మసాని**

ఢిల్లీ, మహా : పీఎం వాణి ద్వారా ప్రతి పౌరుడికీ సులభమైన పబ్లిక్ వైఫై అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో పీఎం వాణి అమలుపై ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు, ప్రయాణికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరికీ ప్రజా వైఫై కీలక ప్రజా సేవగా మారుతోందన్నారు. వినియోగదారులకు మరింత సులభతరం చేసేలా ల్యాప్ టాప్‌లు, ఇతర సెకండరీ పరికరాలకు క్యూఆర్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మొబైల్ ద్వారా క్యూఆర్ స్కాన్ చేసి సులభంగా ల్యాప్‌టాప్‌ను కనెక్ట్ చేసుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. తక్కువ సమయం ఇంటర్నెట్ అవసరమయ్యే వినియోగదారుల కోసం 15, 30, 60 నిమిషాల స్వల్ప కాల వినియోగ ప్లాన్లు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, మాల్స్, ప్రజా ప్రదేశాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత సులభతరం చేయడమే లక్ష్యమన్నారు. పీఎం వాణి హాట్‌స్పాట్‌ల గుర్తింపును మరింత సులభతరం చేసేలా స్టాండర్డ్ నేమింగ్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు చెప్పారు.

# బెంగాల్‌లో 'గుర్తింపు, తొలగింపు, తిప్పివేత'.

**కలకత్తా,మహా.** పశ్చిమ బెం గాల్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన "డిటెక్ట్, డిలీట్ అండ్ డిపోర్ట్" (గుర్తించడం, తొలగించడం,దేశం నుంచి పంపించేయడం) విధానంతో అక్రమ బంగ్లాదేశ్ వలసదారులు పెద్ద ఎత్తున అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు చేరుకుంటున్నారు. నార్త్ 24 పరగణాలు, మాల్దా జిల్లాల సరిహద్దుల్లో కనిపిస్తున్న ఈ దృశ్యాలు, రాష్ట్ర ప్రభుత్వ చొరబాటు వ్యతిరేక చర్యలు కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా పరిపాలనాపరమైన క్షేత్రస్థాయి చర్యలుగా మారాయని స్పష్టం చేస్తున్నాయి.

నార్త్ 24 పరగణాల జిల్లా బసిర్హాత్ సబ్ డివిజన్‌లోని హకీంపూర్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఉదయం వందకు పైగా బంగ్లాదేశ్ పౌరులు తమ దేశానికి తిరిగి వెళ్లేందుకు గుమికూడారు. వీరంతా బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నివసిస్తున్నారని, విదేశీ జాతీయుల కోసం ప్రభుత్వం హోల్డింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చేసిన తాజా ప్రకటనల నేపథ్యంలోనే భయాందోళనలతో వీరు సరిహద్దుకు చేరుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. పౌరసత్వ సవరణ చట్టం పరిధిలోకి రాని వారందరినీ చొరబాటుదారులుగా పరిగణించి, రాష్ట్ర పోలీసుల ద్వారా అరెస్ట్ చేసి బీఎస్ఎఫ్‌కు అప్పగిస్తామని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, అక్రమ చొరబాటుదారులను తాత్కాలికంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో 'హోల్డింగ్ సెంటర్'లను ఏర్పాటు చేయడం ప్రారంభించింది. మాల్దా జిల్లాలోని ఇంగ్లీష్ బజార్ పట్టణ పరిధిలో ఉన్న చందన్ పార్క్ వద్ద మొదటి హోల్డింగ్ సెంటర్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. గజోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాండువాలో పట్టుబడిన తొమ్మిది మంది అనుమానిత బంగ్లాదేశీయులను (ముగ్గురు మహిళలు, ఆరుగురు మైనర్లు) ఆదివారం ఈ సెంటర్‌కు తరలించారు. ఇక్కడ సీసీటీవీ నిఘాతో పాటు 12 మంది పోలీసు సిబ్బంది, సివిల్ డిఫెన్స్ మరియు ఇతర సహాయక సిబ్బందితో 24 గంటల పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో అనుమానిత చొరబాటుదారులను గరిష్టంగా 30 రోజుల పాటు ఉంచుతారు. ఈ సమయంలో జిల్లా మేజిస్ట్రేట్లు, సంబంధిత అధికారులు వారి పత్రాలను పరిశీలించి, బయోమెట్రిక్ వివరాలను సేకరించి కేంద్ర డేటాబేస్‌లో నమోదు చేసిన అనంతరం వారిని స్వదేశానికి పంపిస్తారు. ముఖ్యంగా 2025లో అమల్లోకి వచ్చిన ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ ప్రకారం.. నిఘా, నిర్బంధం, తిప్పి పంపే ప్రక్రియలకు ఆధునిక సాంకేతికతను జోడించడంతో పాటు, అనుమానితులను ఎలాంటి వారెంట్ లేకుండా అరెస్ట్ చేసే అధికారాన్ని హెడ్ కానిస్టేబుల్, ఆపై స్థాయి పోలీసు అధికారులకు కల్పించారు.



# పోరాటాలతోనే గిరిజన హక్కులు సాధ్యం

- **సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా**

**బూర్గంపహాడ్ మహా** : గిరిజనుల హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలే శరణ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పుసాక రాజీవ్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ గిరిజన సంఘం మండల మహాసభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ముందుగా పతాక ఆవిష్కరణ చేసి అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు కనీస అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని ఆయన విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లమల గిరి ప్రసాద్ నాయకత్వాన పాల్వంచ ప్రాంతానికి చెందిన గిరిజన కమాండర్ సోయం గంగులు సాగించిన పోరాట స్ఫూర్తితో గిరిజన యువతి యువకులు తమ తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. నేటికీ గిరిజన గ్రామాల్లో హరహదారులు, విద్యుత్, విద్య, వైద్యం మరియు త్రాగునీరు వంటి కనీస అవసరాలు తీర్చడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ జల్ జంగిల్ జమీన్ నినాదంతో నిర్వహించే పోరాటాలలో గిరిజన యువతి యువకులు పాల్గొని గిరిజన హక్కులను సాధించుకోవడంలో ముందుండి పోరాటం నిర్వహించాలని కోరారు. అదేవిధంగా గిరిజన గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల గిరిజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులుమువ్వ వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు పాల్వంచ మండల కార్యదర్శి పూర్ణ సిపిఐ నాయకులు గుత్తుల సత్యనారాయణ సిపిఐ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి చారి.కుంజ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

# దర్జాగా డ్రైనేజీ లు ఆక్రమణ

- ఆర్ అండ్ బి అధికారుల అడ్రస్ ఎక్కడ....?
- పుట్ పాత్ లేకపోతే జరిగే ప్రమా-దాలకు భాద్యులెవరు....?
- ప్రశ్నిస్తే తప్పని బెదిరింపులు..
- ప్రజాసమస్యలను పట్టించుకోని అధికారులు.



**దమ్మపేట ,మే 26 మహా** : మండల కేంద్రంలో దర్జాగా డ్రైనేజీ లను ఆక్రమించుకొని ,పక్కాగా నిర్మాణాలు చేస్తుంటే పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఒకరిని చూసి మరొకరు ఇలా అందరూ రోడ్లపైకి వచ్చి శాశ్వత వ్యాపార దుకాణాలు పెడుతుంటే పార్కింగ్ చేసేందుకు ప్రదేశం ఎక్కడ...? ప్రమాదాలు జరిగితే సమాదానం చెప్పేదెవరు....? అసలు రోడ్లు భవనాల అధికారులు ఉన్నట్లా...? లేనట్లా...? ఈ విషయాలు పంచాయతీ రాజ్ శాఖ కు చెందవా...? ఆర్ అండ్ బి శాఖ కు వర్తించవా...? అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.

**దర్జాగా డ్రైనేజీలు ఆక్రమణ** : రోడ్డుకు మధ్యనుండి దాదాపు గా 50 అడుగులు వెడల్పు తీసి డ్రైనేజీలు నిర్మించారు. రోడ్లను ఎక్సటెన్షన్ చేసే సమయంలో ఆర్ అండ్ బి అధికారులు దగ్గర ఉండి , వారి పరిమితికి లోబడి ఉన్న నివాసీయులను తక్షణమే ఖాళీ చేయాలని ,రోడ్లు వెడల్పు చేస్తున్నామంటూ హుటాహుటాహుటిన ఖాళీ చేయించారు.

ఎందరో నిరుపేదలు సగం ఇండ్లలో ఉంటూ దిక్కతోచని పరిస్థితి ల్లో వేరే ప్రదేశానికి వెళ్ళి నివాసం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మరి ఆసమయంలో ఉన్న అధికారుల నిబద్దత ఇప్పుడేమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**డ్రైనేజీ లు ఎందుకు నిర్మించినట్లు...?**

లక్షల రూపాయలు ప్రజాధనం ఉపయోగించి రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ను దాదాపుగా 5 కిలో మీటర్ల పొడవునా నిర్మించారు. అవి ప్రజా అవసరాలకు ఉపయోగపడకపోతే...కాదు ..కాదు.... వాటిని ఉపయోగించుకోకపోతే తప్పెవరిది అవుతుందో ఆలోచించారా....? లక్షల రూపాయల ప్రజాధనం ఎందుకు వృధా కావాల్సి వస్తుందో... ఎవరైనా ఆలో చించారా....?

**అసలే రాబోయేది వర్షాకాలం** : డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోతే వచ్చే వర్షాకాల సీజన్ లో అంటు వ్యాధులు ప్రబలితే అందుకు భాద్యులెవరు...? డ్రైనేజీ ఆక్రమణ దారులు రేపు ప్రతి ఒక్కరి కుటుంభానికి బాసటగా ఉంటారా....? ఆ కుటుంబం లో జరిగే అనారోగ్య సమస్యలకు భాద్యత వహిస్తారా....? ఈ ప్రశ్నలకు సమాదానం చెప్పేవారుంటే డ్రైనేజీలే కాదు సుమీ , ఏకంగా రోడ్డు మధ్యలోనే నివాసాలు ,వ్యాపార సముదాయాలను నిర్మించుకోమని అధికారులు చెప్పండి అంటూ ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

**ఎందుకు అధికారులకు అలసత్వం** : ప్రజా పన్నులతో , నిరుపేదల చెమటను రక్తంగా మార్చి చెల్లించే ప్రజా సుంకంతో ప్రభుత్వ అధికారులు జీతభత్యాలు పొందుతూ హాయిగా ఏసి కార్లలో బట్టలు నలగకుండా తిరిగేటందుకా...అధికారం...?ప్రజా సమస్యలను పరిష్కరించేందుకా..? అంటూ సామాన్య మానవుడి సైతం అధికారులను ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీ ఆక్రమణలను తొలగించలేక పోవడానికి గల వాస్తవ కారణాలేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రమాదాలు జరిగితే భాద్యత నీదా....?**

అధికారం చేతపుచ్చుకున్న ఏ అధికారైనా స్పందిస్తే ఇందుకు సమాదానం ఏమిటి...? రోడ్లపైనే పార్కింగ్ వాహనాలు నిలిపి ,డ్రైనేజీలపై ఉన్న దుకాణాలలోకి సామాన్య ప్రజలు వివిద లావాదేవీలపై వెళ్ళి వస్తుంటారు. అడ్డూ అదుపులేని బైక్ రైజర్లు వచ్చి తగిలినా ...? లేదా ప్రమాదవశాత్తు ఏదేని బారీ వాహనాల వలన ప్రమాదాలు సంభవించినా అందుకు భాద్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రశ్నిస్తే...బెదిరింపు లా....?**

డ్రైనేజీ వ్యవస్థ పై అధికారుల తీరు ,పాలకుల తీరు మార్చుకోవాలని మహా పత్రికలో సోమవారం ప్రచురితమైన కథనం పట్ల సామాజిక స్పృహ కలిగిన మేధావులు పాజిటివ్ గా స్పందిస్తే.....కొందరు మాత్రం బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ఎంత వరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. అధికారులు మేజర్ పంచాయతీ ని సుందరంగా తీర్చిదిద్దడంలో బాగస్వాములవుతారో...? లేక మనకెందుకు లే అనుకొని సరిపెట్టుకుంటారో..... వేచిచూద్దాం మరి.



# గ్రామంలో నీటి సమస్య లేకుండా బోర్లు వేయించిన సర్పంచ్

- **పదవి బాధ్యత చేపట్టినప్పటి నుండి మూడు బోర్లు వేయించి సమస్య తీర్చిన సర్పంచ్**
- **మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ రాములు**

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మండలంలోని మోత్కుపల్లి గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రజల దహార్తిని తీర్చేందుకు నీటి ఎద్దడి ఏర్పడకుండా బోర్లు వేయించి గ్రామ ప్రజల సమస్యను తీర్చిన సర్పంచ్ సంపూర్ణ రాములు. గ్రామంలోని ప్రతి సమస్య తెలుసుకొని దశలవారీగా ప్రజల సమస్యలు తీరుస్తూ ముందుకు వెళుతున్న సర్పంచ్ సంపూర్ణ రాములు పై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు. సర్పంచ్ సంపూర్ణ రాములు మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గ్రామంలో మూడు బోర్లు వేయించడం జరిగింది. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నేను ముందుండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు నాయకులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణకు మణిహారంలా కోహెడ మార్కెట్.!

- **వచ్చే నెల 3న ముఖ్యమంత్రి చేతుల మీదుగా మార్కెట్ శంకుస్థాపన**
- **ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:జూన్ 3వ తేదీన కోహెడలో జరిగే గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్యక్రమమునకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతీలతో కలిసి కోహెడలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమమునకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి, ఆదిబట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధి కోహెడ రెవిన్యూ సర్వే నంబర్ 167/1లో కోహెడ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు జూన్ నెల 3న ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 239 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో 167/1లో సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ 239 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమును నిర్మించడం జరుగుతుందని, తెలంగాణకు మణిహారంలగా కోహెడ మార్కెట్ ఉంటుందని తెలిపారు. జూన్ 3న శంకుస్థాపన కార్యక్రమమును ముఖ్యమంత్రి చేతులమీదుగా చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అందరికీ నాయ్యం చేయడం జరుగుతుందని అన్నారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమమునకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ నుండి పూర్తి సహకారం అందించి విజయవంతం అయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైపల్యం చెందింది

- **రైతు గోస- బీజేపీ భరోసా బస్సు యాత్ర కార్యక్రమంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి మే 26 మహా** : ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని,బిజెపి అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం అన్నదాతకు అండగా రైతు గోస బిజెపి భరోసా బస్సు యాత్ర లో భాగంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తి ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని, ఆలేరు మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు సందర్శించారు.

నెలల తరబడి కొనుగోలు చేయకుండా ఉన్న వరికుప్పల రాశుల వద్ద నిరీక్షిస్తున్న రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు ప్రధానంగా కొనుగోలు అయిన ధాన్యం లారీల సమస్యలతో లోడింగ్ కావడం లేదని రైతులు బిజెపి నాయకులకు వివరించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూమొదటి రోజు పరిగి నుంచి ప్రారంభమైన గజ్వేల్ వరకు రహదారుల వెంట ధాన్యం కుప్పల వద్ద రైతుల పడిగాపులు దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి ప్రాణాలు వదులుతున్న పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం గాఢ నిద్రలో ఉందని మండిపడ్డారు. లక్ష్మీపేట ఈదురు గాలులకు సమీపంలో చెట్టు కూలి ముగ్గు రైతులు మృతి చెందిన సంఘటన, ఇప్పుడే అందిన సమాచారం మేరకు ఆలేరులో ఒక రైతు ప్రాణాలు వదిలిన సంఘటనలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీరుపై విరుచుకుపడ్డారు. రైతాంగానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తో గద్దెనికి ఇప్పుడు హరిగోస పెడుతున్నారని ధరణి పోర్టల్ రద్దు చేసి కొత్త రెవెన్యూ చట్టం, పోడు భూములకు పట్టాలు ఇస్తాం అన్న హామీలు మర్చిపోయారా అని విమర్శించారు.బిజెపి నాయకులను వస్తున్నారు అనగానే పెద్ద ఎత్తున లారీలు ఏర్పాటు చేయడం కొనుగోలు చేసే ప్రక్రియను చేపట్టడం చూస్తుంటే రైతుల కోసం బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నాయకుడు ఊరూరా తిరుగుతామని ధాన్యం కొనుగోళ్లు జరిపిస్తాం అన్నారు. ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని చెప్పారు సందర్భంగా మాట్లాడుతూ, మేము మాట్లాడుతుంటే అసెంబ్లీలో మైక్ కట్ చేస్తారు.బయట కరెంటు తీస్తారు అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా,ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి,కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, వేముల అశోక్, కాసం వెంకటేశ్వర్లు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేముల వీరేశంపై విమర్శలు చేస్తే సహించం

**సంగిశెట్టి క్రిస్టఫర్**
**మలిదశ ఉద్యమకారుడు**

**యాదాద్రి భువనగిరి మే 26 మహా న్యూస్** : ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మరొక్కసారి ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని మలిదశ ఉద్యమకారుడు టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిసంగిశెట్టి క్రిస్టఫర్ హెచ్చరించారు . ప్రజా నాయకుడు ఉద్యమ నాయకుడు తెలంగాణ సాధకుడు మలిదశ ఉద్యమకారుడు వేముల వీరేశంపై ఆరోపణలు చేసే ముందు మీ గత చరిత్ర తెలుసుకోని మాట్లాడాలని అన్నారు ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలే పరిష్కారం దిశగా పనిచేస్తున్న ఎమ్మెల్యే వీరేశంపై పిచ్చిపిచ్చిగా ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి వందలాది కేసులు మీద పెట్టుకొని జైలు నిర్బంధాలను ఎదుర్కొన్న వ్యక్తి వేముల వీరేశం అన్నారు అలాంటి వ్యక్తిపై మీరా ఆరోపణలు చేసేది అని ఎద్దేవా చేశారు

# తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన




**యాదాద్రి భువనగిరి మే 26 మహా** :తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక శిఖరం అమరవీరురాలు బెల్లి లలితక్క త్యాగం యావత్ తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ కీర్తించేలా ఉంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కొనియాడారు.

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టకు మంగళవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భువనగిరి వచ్చినప్పుడు కూడా లలితక్క పోరాటాన్ని, ఆమె త్యాగాన్ని ప్రత్యేకంగా స్మరించుకున్నారని గుర్తుచేశారు. పార్టీలకు అతీతంగా, కుల సంఘాలు, ప్రజా నాయకులు, ఉద్యమకారులు మరియు లలితక్క కుటుంబ సభ్యులు, అభిమానులు అందరూ కలిసికట్టుగా చేసిన కృషి వల్లే ఈ రోజు శంకుస్థాపన సాధ్యమైందని ఆయన అభినందించారు భువనగిరి ప్రజల 27 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ, కల ఈ రోజుతో నెరవేరిందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. బెల్లి లలితక్కతో అమరులైన ఐదు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశట్టి మంజుల వేంకటేశ్వర్లు, గ్రంథాలయ చర్మెన్ ఆవైస్ చిస్తి,భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు తుమ్మేటి పాండు,తోటకూర విజయలక్ష్మివెంకటేష్, బర్రె పూజిత జహంగీర్ , గుర్రాల సంతోష శ్రీనివాస్, కుక్క దువ్వు పద్మా సోమయ్య, చీమల రాజు, బింగి నరేష్, బొంత నర్సింగరావు, పోలిశెట్టి అనిల్, బురాన్,జలిగం విఘ్నేష్, జంగిటి వినోద్, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్ విగ్రహ కమిటీ సమన్వయ కర్తలు బెల్లి లలితక్క కుమారుడు సూర్య ప్రకాష్, జన్ని వెన్నెల, నరాల నిర్మల వెంకట స్వామి, పాక మల్లేష్, ఎల్లమల జంగయ్య ex కౌన్సిలర్స్ ఉదరి లక్ష్మీ సతీష్, వడిచెర్ల కృష్ణ, క్యామ మల్లేష్, సామ మల్లారెడ్డి, భట్టు రామచంద్రయ్య, భువనగిరి శ్రీనివాస్ నేత, బెల్లి లలితక్క కూతురు స్నేహలత హైకోర్ట్ అడ్వకేట్ కదిరె కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, కృష్ణ యాదవ జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేశం, పట్టణ అధ్యక్షులు మర్రి పందు వట్టె జానయ్య, వనజక్క, గుండెబోయిన సురేష్,నక్కల చిరంజీవీ, శెట్టి బాలయ్య, చిక్కుల వెంకటేశం, తుమ్మేటి శ్రీశైలం, యాదయ్య, కాశపాక మహేష్ , మల్లారెడ్డి Q న్యూస్ సుదర్శన్, మేకల ఆంజనేయులు,శ్రీపతి బిక్షపతి,దండబోయిన శ్రీశైలం,కొత్త జంగిహీర్, శ్రీరామ్ శరత్, దూదూరి సురేష్, కుటుంబ సభ్యులు భువనగిరి పట్టణ ప్రజలు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు అభిమానులు,ప్రజా సంఘాలు, కుల సంఘాలు నాయకులు పాల్గొన్నారు



# వంద మంది కౌన్సిలర్ల రాజీనామా

- **మమతా పార్టీకి అతిపెద్ద సంక్షోభం.**
- **అసంతృప్తిలో ఎంపీలు.**
- **బీజేపీ సమావేశానికి సీనియర్ల హాజరు.**

హైదరాబాద్, మహా పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చేతిలో ఘోర పరాజయం పాలైన తర్వాత, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కాకోలి ఘోష్ దస్తిదార్ లాంటి సీనియర్ నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, గత కొద్ది రోజుల్లోనే వివిధ మున్సిపాలిటీలకు చెందిన దాదాపు వంద మంది కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ పరిణామాలతో బీజేపీ స్థానిక మున్సిపల్ బోర్డుల్లో తమ పట్టు పెంచుకునే అవకాశం ఏర్పడింది. పరిస్థితి తీవ్రతను బట్టి చూస్తే, వచ్చే ఏడాది జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పలు మున్సిపల్ బోర్డులు రద్దయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ సైతం రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. కౌన్సిలర్లను రాజీనామా చేయొద్దని మమత కోరినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని, 1998లో పార్టీ ఆవిర్భావం తర్వాత టీఎంసీకి ఇదే అత్యంత క్లిష్టమైన పరిస్థితి అని స్పష్టమవుతోంది.

# రైతులను రెచ్చగొట్టేందుకే రైతు గోస బిజెపి భరోసా యాత్ర

- **భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి మే 26 మహా** : వడ్ల కొనుగోలు అంశంపై బీజేపీ రైతుల్లో అపోహలు సృష్టిస్తూ గందరగోళ పరిస్థితులు కల్పించి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విమర్శించారు.

మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరాజకీయ లబ్ధి కోసమే బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు

గత రెండు పంటల సీజన్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం CMR (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

మా ప్రజాప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.మా ముఖ్యమంత్రి , మంత్రులు స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పండిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి అయోమయానికి గురికావద్దని సూచించారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధిక ధరకు వడ్ల కొనుగోలు జరుగుతోందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం మరింత మెరుగ్గా వడ్ల కొనుగోలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంట దిగుబడి నమోదైందని, అధిక దిగుబడి వచ్చినప్పటికీ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం బీజేపీనేనని ఆరోపిస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉద్యమాల తర్వాత వాటిని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రైతు సంక్షేమం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు వాస్తవాలను గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతు భరోసా యాత్రను తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీజేపీ నాయకులకు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చస్తి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు బర్రె జహంగీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో తొలగని ఉద్రిక్తతలు



ప్రపంచ రాజకీయాల్లో, ఆర్థిక వ్యూహాల్లో పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) అత్యంత కీలకమైన ప్రాంతం. అయితే, గత కొంతకాలంగా ఈ ప్రాంతం నిరంతర ఉద్రిక్తతలకు, యుద్ధ వాతావరణానికి కేంద్రబిందువుగా మారింది. ముఖ్యంగా ఇరాన్, అమెరికాల మధ్య నడుస్తున్న ప్రచ్ఛన్న మరియు ప్రత్యక్ష ఘర్షణలు అంతర్జాతీయ సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. శాంతి చర్చలు జరుగుతున్నాయని భావిస్తున్న తరుణంలోనే, పరస్పర దాడులు మరియు డ్రోన్ల కూల్చివేతలతో ఈ ప్రాంతంలో మళ్లీ మంటలు చెలరేగుతున్నాయి.

ఇరాన్‌అమెరికా ఘర్షణల్లో అత్యంత వ్యూహాత్మకమైన చర్య హోర్ముజ్ జలసంధి మూసివేత. ప్రపంచ చమురు, సహజ వాయువు (గ్యాస్) రవాణాకు ఈ జలసంధి అత్యంత కీలకమైన మార్గం. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో సింహభాగం ఈ మార్గం గుండానే సాగుతుంది. ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. దీని ప్రభావం కేవలం పేద, మధ్యతరగతి దేశాలపైనే కాకుండా, అభివృద్ధి చెందుతున్న మరియు అగ్రరాజ్యాలైన అభివృద్ధి చెందిన దేశాలపై కూడా తీవ్రంగా పడింది. సరఫరా నిలిచిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఆకాశాన్నంటాయి. భారత దేశం తన చమురు అవసరాల కోసం అత్యధికంగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. పశ్చిమాసియా సంక్షోభం భారత్‌ను గట్టిగా దెబ్బతీసింది. చమురు కొరత కారణంగా దేశంలో కేవలం 10 రోజుల వ్యవధిలోనే ఏకంగా నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాల్సి వచ్చింది. ఇంధన ధరల పెరుగుదల రవాణా వ్యయాన్ని పెంచి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు (ద్రవ్యోల్బణానికి) దారితీస్తోంది, ఇది సామాన్యుడి బతుకును భారం చేస్తోంది.

శాంతి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆశలపై నీళ్లు చల్లుతూ తాజాగా ఇరాన్ ఒక సంచలన ప్రకటన చేసింది. గల్ఫ్ రీజియన్‌లో తమ వైమానిక పరిధిలోకి ప్రవేశించిన అమెరికాకు చెందిన అత్యంత అధునాతన ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు విజయవంతంగా కూల్చివేసినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' వెల్లడించింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ దాడిని ధృవీకరించింది. ఈ ఘటనతో పాటు అదే సమయంలో ఇరాన్ సరిహద్దుల్లోకి చొరబడేందుకు ప్రయత్నించిన
మరొక అమెరికన్ ఆర్ క్యూ4 డ్రోన్, అత్యాధునిక ఎఫ్35 (F35) ఫైటర్ జెట్స్ పైనా తాము దాడులు చేశామని, దాంతో అవి వెనక్కు తగ్గాయని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన కొన్ని నౌకలపై అమెరికా బలగాలు దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ఇరాన్ ఈ డ్రోన్‌ను కూల్చివేయడం గమనార్హం. దీనిని అమెరికా చర్యకు ఇరాన్ ఇచ్చిన ప్రతీకార సమాధానంగా భావించవచ్చు. అయితే, ఈ డ్రోన్ కూల్చివేతపై అమెరికా రక్షణ విభాగం (పెంటగాన్) నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదా స్పందన రాలేదు. ఈ తాజా పరిణామాలు పశ్చిమాసియాను మరింత అస్థిరతలోకి నెట్టేసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికా, ప్రాంతీయ శక్తి అయిన ఇరాన్ మధ్య ముదురుతున్న ఈ పంతాలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా ప్రపంచ యుద్ధానికి దారితీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధి త్వరగా తెరుచుకోకపోతే మరియు ఇరు దేశాలు సంయమనం పాటించకపోతే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి కూరుకుపోవడం ఖాయం. ఐక్యరాజ్యసమితి మరియు ఇతర ప్రపంచ దేశాలు జోక్యం చేసుకుని ఇరుపక్షాల మధ్య శాంతిని నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# మన దోసె.. ఇపుడు గ్లోబల్ బ్రాండ్

## ఇడ్లీ, సాంబార్ లాగే.. ఇంగ్లీష్ పదంగా దోసె

## యూకే, అమెరికా, ఆస్ట్రేలియా బ్రేక్ ఫాస్ట్ లలో దోసె క్రేజ్

**మహా :** మన ఇంట్లో ఉదయాన్నే ప్లేటులో మెరిసే వేడివేడి 'దోసె' ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై 'గ్లోబల్ బ్రాండ్'గా అవతరించింది. భాషలు మారినా, దేశాలు దాటినా తన రుచిని, రూపాన్ని మాత్రమే కాదు... చివరికి తన 'పేరును' కూడా మార్చుకోకుండా ప్రపంచాన్ని శాసిస్తోంది. విదేశాల్లో ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా దీనిని ఆంగ్లంలో ప్రత్యేకంగా అనువదించకుండా, 'దోసె' అని మాత్రమే పిలుస్తుండటం విశేషం.

**'క్రిస్పీ పాన్‌కేక్' కాదు... కేవలం 'దోసె'!**

సాధారణంగా విదేశీయులకు మన వంటకాలను పరిచయం చేసేటప్పుడు అర్థం కావడం కోసం "క్రిస్పీ పాన్‌కేక్" లేదా "సేవరీ క్రేప్" అని మెనూ కార్డుల్లో వివరిస్తుంటారు. కానీ ఆర్డర్ ఇచ్చేటప్పుడు మాత్రం ప్రతి ఒక్కరూ 'దోసె' అనే పదాన్ని స్పష్టంగా పలుకుతున్నారు. తమిళంలో 'దోసై', కన్నడలో 'దోస', మలయాళంలో 'దోశ', తెలుగులో 'దోసె'గా పిలిచే ఈ అద్భుత వంటకం, ఇంగ్లీషులో సులభంగా పలికే 'Dosa'గా స్థిరపడిపోయింది. ఇప్పటికే ఇడ్లీ, సాంబార్, బిర్యానీ వంటి పదాలు ఆంగ్ల నిఘంటువుల్లో ఎలా చేరిపోయాయో, దోసె కూడా అదే బాటలో పయనిస్తోంది.

### గ్లోబల్ మెనూలో అగ్రస్థానం


ఇపుడు యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ వంటి దేశాలలోని ప్రముఖ నగరాల్లో 'ప్లెయిన్ దోసె', 'మసాలా దోసె'లు విదేశీయుల బ్రేక్‌ఫాస్ట్ మెనూలో తప్పనిసరిగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇందులో ఉండే 'గ్లూటెన్‌ఫ్రీ' , 'వేగన్' గుణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య ప్రియులను ఇది అమితంగా ఆకర్షిస్తోంది. మొక్కవోని రుచితో, సొంత పేరుతో ప్రపంచ ఆహార ప్రియుల మనసు దోచుకుంటూ... అంతర్జాతీయ స్థాయిలో మన దక్షిణాది సంస్కృతీ వారసత్వాన్ని ఘనంగా చాటుతోంది మన దోసె.

**పేరు వెనుక ఆసక్తికరమైన కథలు**

దోసె పేరు వెనుక ఒక విచిత్రమైన కథ ప్రచారంలో ఉంది. సంస్కృతంలో 'దోషం' అనే పదం నుంచి 'దోసె' వచ్చిందని అంటారు. పూర్వం పులియబెట్టిన పదార్థాలు తినకూడదనే నియమం ఉన్న ఒక పూజారి, బియ్యం పిండి పులిసిపోవడంతో దానిని పారేయలేక అట్టులా వేసుకున్నాడని... నియమాన్ని ఉల్లంఘించినందుకు (దోషం చేసినందుకు) దానికి ఆ పేరు వచ్చిందని ఒక కథనం. అయితే దీనికి బలమైన చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, వినడానికి మాత్రం ఇది ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది.







## సరిహద్దుల ప్రక్షాళనకు

# సంచలన నిర్ణయాలు




దేశ రక్షణ, సార్వభౌమత్వాలకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ సరిహద్దుల్లో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. అక్రమ చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాల వల్ల సరిహద్దు రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో అనూహ్యంగా, ప్రమాదకర స్థాయిలో మారుతున్న డెమోగ్రఫీ (జనాభా సమతుల్యత) వెనుక ఉన్న కుట్రలను ఛేదించేందుకు కేంద్రం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పుగా మారుతున్న ఈ వ్యవహారంపై లోతైన అధ్యయనం చేసి, వాస్తవాలను వెలికితీసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని మంత్రి మండలి ఒక అత్యున్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం సంచలన నిర్ణయం తీసుకుంది. గతేడాది (2025) ఆగస్టు 15న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రకటన ఆధారంగానే ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం అధికారికంగా వెల్లడించారు. సరిహద్దుల్లో మారుతున్న జనాభా తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు రిటైర్డ్ జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నౌలేకర్ ఛైర్మన్‌గా ఈ పవర్‌ఫుల్ కమిటీని కేంద్రం నియమించింది. ఈ కమిటీలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఉద్దండులను సభ్యులుగా చేర్చింది. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, నిఘా వ్యవస్థలపై పట్టున్న మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ శామికా రవిలతో పాటు భారత జనగణన కమిషనర్ ఇందులో కీలక సభ్యులుగా ఉండనున్నారు. కేంద్ర హోంశాఖలోని ఫారినర్స్I విభాగ జాయింట్ సెక్రటరీ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. దేశంలోని మత, సామాజిక వర్గాల వారీగా అసాధారణ జనాభా పెరుగుదల నమూనాలను సమగ్రంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి సమయపాలిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించి కేంద్రానికి సిఫార్సులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఈ జనాభా మార్పుల వ్యవహారంపై హోం మంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. "జనాభా మార్పు అనేది కేవలం సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమే కాదు. ఇది జాతీయ భద్రత, శాంతిభద్రతలు, సామాజిక నిర్మాణం, గిరిజన సమాజాల పరిరక్షణకు కూడా నేరుగా సంబంధించిన విషయం" అని ఆయన కుండబద్దలు కొట్టారు. సరిహద్దుకు ఇరువైపులా ఉన్న భౌగోళిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని జరుగుతున్న అక్రమ చొరబాట్లు సామాజిక సమతుల్యతకు అతిపెద్ద సవాల్‌గా మారాయని స్పష్టం చేశారు. స్థానిక జనాభా స్వరూపం పూర్తిగా మారిపోవడం వల్ల దేశ అంతర్గత భద్రతకు తీవ్ర విఘాతం కలుగుతోందని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో సరిహద్దు భద్రతను అభేద్యంగా మార్చేందుకు పలు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్ వంటి సరిహద్దు రాష్ట్రాలలో అక్రమ చొరబాట్లను సమూలంగా అరికట్టేందుకు సరిహద్దు భద్రతా దళాల నిఘాను అత్యాధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు. యాంటీఇన్‌ఫిల్ట్రేషన్ గ్రిడ్‌ను కట్టుదిట్టం చేయడంతో పాటు, సరిహద్దు జిల్లాల్లో నకిలీ పత్రాలతో ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు పొందిన అక్రమ చొరబాటుదారులను ఏరివేసేందుకు ఒక అతిపెద్ద ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. అంతేకాకుండా, 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్' ద్వారా సరిహద్దు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను భారీగా అభివృద్ధి చేసి, అక్కడి స్థానికులే దేశ రక్షణ కవచంగా మారేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ సంచలన నిర్ణయం దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ చర్చలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసలు, జనాభా మార్పుల అంశం ఎప్పటికప్పుడు రాజకీయంగా వివాదాస్పదంగా మారుతున్న నేపథ్యంలో, ఈ ఉన్నత స్థాయి కమిటీ విచారణ, తదుపరి చర్యలపై ప్రతిపక్షాలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

**- మహా డెస్క్**



# పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

- సీపీఎం బూర్గంపాడు మండల కమిటీ డిమాండ్
- సారపాక బస్టాండ్ సెంటర్‌లో నిరసన ఆందోళన

**బూర్గంపహాడ్ మహా** : పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల కమిటీ నాయకులు సారపాక బస్టాండ్ సెంటర్‌లో నిరసన ఆందోళన నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై నిరంతరం భారాలు మోపుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తోందని నాయకులు తీవ్రంగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను మతాలు, కులాల పేరుతో పక్కదారి పట్టిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతోందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో పాటు ఉప్పు నుంచి పప్పు, వంటనూనె వరకు అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశ సంపద మొత్తం కార్పొరేట్ శక్తులకు, ముఖ్యంగా అదానీ, అంబానీ వంటి పెద్ద వ్యాపార వర్గాలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరల కారణంగా ప్రజలు కనీస అవసరాల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగం పెరిగిపోయిందని, చదువుకున్న యువతకు ఉద్యోగాల పేరుతో మోసపూరిత హామీలు ఇచ్చారని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం యువతను నిరాశపరిచిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో మోటార్ సైకిళ్లు నడపడం కూడా భారంగా మారిందని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తైన వెంటనే వరుసగా నాలుగుసార్లు ధరలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని అన్నారు. గతంలో రూ.60 ఉన్న పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.117కు చేరుకోవడం దారుణమని పేర్కొన్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ధరల పెంపు ఇంతటితో ఆగదని, ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ నిరసన కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, ఎస్కే అబిద్, భయ్యా రాము, గుంటుక కృష్ణ, పాండవుల రామనాథం, కనకం వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# భూ సాంద్రతను పెంపొందించుకోవాలి

- సేంద్రియ ఎరువులతోనే వ్యవసాయం లాభసాటి
- పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె.



**దమ్మపేట ,మే 26 మహా** : రైతులు భూ సారాన్ని పెంపొందించుకోవాలని , సేంద్రియ ఎరువుల వాడకం వల్లనే అది సాధ్యమైన పనిగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోపరేటివ్ సొసైటీ ఆవరణలో జరిగిన పచ్చిరొట్ట పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ,రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న జీలుగులు ,పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. వ్యవసాయ శాఖ ,కోపరేటివ్ సహకార శాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి సాగు పూర్తయ్యాక మిగిలిన వరి దుబ్బులు ,అంటే వ్యర్థాలను భూమిపైనే ఉంచి మంట బెట్టడం చేస్తున్నారని ,అది వందశాతం మంచి పని కాదని రైతులను హెచ్చరించారు. ప్రతి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం చేపట్టి ,తద్వారా రైతులకు ఎప్పటికప్పుడు పంటల పైన సూచనలు చేస్తున్నప్పటికీ రైతులలో మార్పు రావడం లేదన్నారు.

**భూ సారం పెంచుకోవాలి** : మండల వ్యాప్తంగా తొమ్మిది వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నారని తెలిపారు. ఐతే వరి సాగు నేలల్లో భూ సారం పెంపొందించుకోవాలంటే సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు.

**50శాతం సబ్సిడీ ని సద్వినియోగం చేసుకోండి** : ప్రభుత్వం అందిస్తున్న 50శాతం సబ్సిడీ విత్తనాల పథకాన్ని రైతులు నేరుగా ఉపయోగించుకోవాలని సూచించారు. మన మండలానికి 500 క్వింటాలు జీలుగు విత్తనాలు , 120 క్వింటాలు జనుము విత్తనాలు అందుబాటులో కి రావడం జరిగిందని తెలిపారు. ఐతే వీటి పూర్తి ధర 30కేజిల బస్తా 4905 రూపాయలు గా ఉంటే దానిలో రైతు 50 శాతం సబ్సిడీపై మిగిలిన 2452 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. అదేవిధంగా జనుము విత్తనాలు 40కేజిల బస్తా ధర 6220 రూపాయలుగా ఉంటే రైతు మాత్రం 3110రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇట్టి అవకాశం గరిష్టంగా ఐదు ఎకరాల లోపు రైతులకు మాత్రమే అందజేయడం జరుగుతుందని తెలిపారు. భూమి యొక్క పట్టాదారు పాస్ బుక్ ,ఆధార్ కార్డు జిరాక్స్ లను సహకార సంఘం నందు అందించి రైతులు విత్తనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి చంద్రశేఖర్ రెడ్డి , దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి ,రాంబాబు , ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాస్ , కోపరేటివ్ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప , రావు గంగాధర రావు ,చిన్నశెట్టి యుగంధర్ ,మండల కాంగ్రెస్ అద్యక్షుడు కక్కిరాల రమేష్ ,పర్వతనేని ప్రసాద్ , మహిళా కాంగ్రెస్ నాయకులు వనమాల వసంతమాల , తదితరులు పాల్గొన్నారు.



## వడదెబ్బతో వ్యక్తి మృతి

**జూలూరుపాడు, మహా**: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన జూలూరుపాడు మండలంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మండలంలోని బచ్చల కోయగూడెం గ్రామానికి చెందిన జబ్బా రామనాథం (55) అలియాస్ సుధాకర్ అను వ్యక్తి మే 23వ తేదీన తీవ్ర వడదెబ్బకు గురైనట్లు తెలిపారు. సోమవారం అతనిని కొత్తగూడెం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్స పొందారన్నారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం జబ్బా రామనాథం మృతి చెందినట్లు బంధువులు వెల్లడించారు. వడదెబ్బతో రామనాథం మృతి చెందినట్లు మృతుడి భార్య అనసూర్య స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రామనాథం మృత దేహాన్ని కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



## కార్మికుల వేతనాలు పెంచండి
### సిఐటియు డిమాండ్

**దమ్మపేట ,మే26 మహా** : పెరిగిన నిత్యవసరాలకు అనుగుణంగా కార్మిక వేతనాలు పెంచాలని సిఐటియు డిమాండ్ చేసింది.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించి కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు డిమాండ్ చేశారు. సి ఐ టి యు మండల కమిటీ సమావేశం విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ 2021 లో కనీస వేతనాలు సలహా మండలి పరిగణన లోకి తీసుకొని ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించే జీవోలు విడుదల చేయాలని కోరారు.పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, 1948 కనీస వేతనాలు చట్టం, సుప్రీం కోర్టు తీర్పులకు అనుగుణంగా శాస్త్రీయంగా వేతనాలు లెక్కిస్తే ముప్పైరెండు వేలరూపాయలకు పెరగాల్సి ఉండగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నామ మాత్రంగా పెంచిందని అన్నారు. తాజాగా కర్ణాటక ప్రభుత్వం కార్మికుల కు అరవై శాతం వేతనాలు పెంచిందని, పెరిగిన కర్ణాటక ప్రభుత్వం వేతనాలు ను పరిగణలోకి తీసుకోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆదినారాయణ, ఈశ్వరమ్మ, నాగు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పొందాలంటే ఫేస్ రికగ్నేషన్ తప్పనిసరి
## సర్పంచ్ లక్ష్మి కుమారి



**జూలూరుపాడు, మహా**: వివిధ రకాల ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న పెన్షనర్లు తప్పనిసరిగా (ఫేస్ అతంటికేషన్) ఫేస్ రికగ్నేషన్ చేయించుకోవాలని నర్సాపురం గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి కోరారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న పెన్షనర్ల ఫేస్ రికగ్నిషన్ ను ఆమె పరిశీలించారు. తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ చేయించుకోవాలని పెన్షనర్లను సర్పంచ్ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు వేలి ముద్రలు సరిగా పడకపోవడం వలన ప్రతి నెల చాలామంది పింఛనుదారులు పింఛను పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫేస్ రికగ్నేషన్ వలన ఇకముందు ఆ ఇబ్బందులన్నీ తొలుగుతాయని అన్నారు. అదేవిధంగా బోగస్ పెన్షన్లు తొలగించి, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పెన్షన్లు అందే విధంగా చూడాలనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. దీనివలన పింఛన్ పొందడం చాలా సులభం అవుతుందని అన్నారు. గ్రామంలో 230 మంది పెన్షన్దారులకు గాను,171 మంది లబ్ధిదారుల ఫేస్ రికగ్నిషన్ పూర్తి అయ్యిందని, 59 మంది లబ్ధిదారులు ఫేస్ అతంటికేషన్లో పాల్గొనవలసి ఉందని తెలిపారు. వీరు జూన్ 15 లోపు తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ చేయించుకోవాలని కోరారు. లేనియెడల ప్రభుత్వం పెన్షన్ ను నిలిపివేసే అవకాశం ఉందని తెలిపారు. కావున పెన్షనర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి హారిక తదితరులు పాల్గొన్నారు.



# గ్రామదీపికల సమస్యలు పరిష్కరించాలి

- బిఆర్ఎస్ డిమాండ్

**దమ్మపేట ,మే 26 మహా** : గ్రామ దీపికల (వీఓఏలు) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక యంపిడివో కార్యాలయం వద్ద గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న గ్రామ దీపికల దీక్షా శిబిరాన్ని ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలను సైతం లెక్కచేయకుండా మహిళలు న్యాయం కోసం రోడ్డెక్కి పోరాడుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏసీ గదుల్లో సేదతీరుతున్నారని విమర్శించారు. మహిళల కష్టం, ఆవేదన పాలకులకు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు కన్నీరు పెట్టుకున్న రాజ్యం ఎప్పుడూ బాగుపడలేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఓఏలకు గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుతం పనిభారం పెరిగినా తగిన వేతనం, గుర్తింపు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో వీఓఏలకు రూ.20 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గ్రామ దీపికల సమస్యలను పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేపడతామని తెలిపారు. గ్రామ దీపికలందరికీ వెంటనే రూ.20 వేల వేతనం అమలు చేసి, వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గాలికి వదిలేశారాని మండిపడ్డారు.ఈ రెండేండ్లలో విపరీతమైన పని చేయించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని చిన్న చూపు చూడడం సరికాదని.వెంటన గ్రామదీపికల డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున వారితో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్,దారా యుగంధర్,పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల,అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీనివాస్ రావు,చీకటి రామయ్య, బుడే,దేవరపల్లి అజయ్ కుమార్,దారా రాము,గోళ్ళ భవనీ కృష్ణ యాదవ్,రావుల శ్రీను,జలగం వాసు,వెలుగోటి మహేష్,కాసిని శ్రీను,కుకలకుంట రవి,ధర్మ,సతీష్,నాగేశ్వరరావు, కోర్సా వెంకటేష్,శంకర్,కనపర్తి కార్తీక్ తదితరులు ఉన్నారు.



## రోటావేటర్ ద్వారా పంట వ్యర్థాలను తొలగించండి
### ఏఓ.చంద్రశేఖర్ రెడ్డి

**దమ్మపేట ,మే 26 మహా** : భూమిలో వేసిన పంటలను తొలగించిన తర్వాత మిగిలి ఉన్న వ్యర్థాలను తొలగించడానికి రోటావేటర్ ను ఉపయోగించి నట్లైతే భూసారాన్ని పెంపుదలచేయవచ్చునని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో 9 వేల ఎకరాల్లో వరిసాగు ,5వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయడం. జరిగిందన్నారు. పంట దిగుబడి పూర్తయ్యాక ,హార్వెస్టింగ్ పూర్తయ్యాక మిగిలిన దుబ్బులను రోటావేటర్ ఉపయోగించి భూసారాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. అలా కాకుండా వదిలి వేయడం వలన ఏదైన నిప్పు అంటుకొని వాతావరణ కాలుష్యం ఏర్పడటమే గాక ప్రక్కన ఉన్న పామాయిల్ తోటలు దగ్ధమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకే ప్రతి రైతు రోటావేటర్ ఉపయోగించి భూసారాన్ని పెంపొందించుకోవాలని కోరారు.




# రాత్రి సమయంలో కూడా మొక్కజొన్న అన్‌లోడింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టాలి

- ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి బ్యూరో, మహా**:రాత్రి సమయంలో కూడా మొక్కజొన్న అన్‌లోడింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న నిల్వ గోడౌన్‌తో పాటు ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు.బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ గోడౌన్‌కు చేరుతున్న మొక్కజొన్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. **మహిళా శక్తి భవన నిర్మాణ పనుల సకాలంలో పూర్తి చేయాలి..** ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి నాణ్యత పూర్తి స్థితిపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యానికి గల కారణాలను వివరంగా నివేదించాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకున్న కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారతకు వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలి

- గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇది ఎంతో ఉపయోగకరం
- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు-న్నాం
- భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ, సీడీపీఓ జ్యోతి




**భద్రాచలం మహా** : 14 సంవత్సరాలు దాటిన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ అన్నారు. అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లలకు యుక్త వయసు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు.మంగళవారం దుమ్ముగూడెం ప్రాజెక్టు పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల సందర్భంగా భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన సీడీపీఓ జ్యోతితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూణేం కృష్ణ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చిన్నారులకు రక్తహీనత రాకుండా పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా బాలామృతం అందజేసి పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేలా అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు.గ్రామాల్లో పోషకాహార ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను వినియోగించేలా ప్రజలకు సూచనలు చేయాలని తెలిపారు.అనంతరం సీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి నివారణ కోసం ఐసీడీఎస్ ప్రాజెక్టు తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరగాలని స్పష్టం చేశారు.మైనారిటీ తీరకముందే వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రులు, వివాహం జరిపించిన పురోహితులు, గ్రామ పెద్దలపై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఐసీడీఎస్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని, లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. అలాగే గ్రామ యువత మానవ అక్రమ రవాణా వంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# మాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆగదు: వీవోఏలు

- 26 వేల గౌరవ వేతనం, పీఆర్సీ అమలు చేయాలి
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత
- బూర్గంపహాడ్‌లో వీవోఏల నిరసన

**బూర్గంపహాడ్ మహా** : ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను ఒప్పుకునే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఐకేపీ వీవోఏలు స్పష్టం చేశారు. కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర వీవోఏ జేఏసీ పిలుపు మేరకు 6వ రోజు సోమవారం బూర్గంపహాడ్ తహసీల్దార్ కె.ఆర్.కె. ప్రసాద్‌కు వీవోఏలు న్యాయమైన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వివో ఏల ప్రధానమైన డిమాండ్లు వీవోఏలకు రూ.26,000 గౌరవ వేతనం, పీఆర్సీ అమలు చేయాలి.వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రమాద భీమా రూ.20 లక్షలు, ఆరోగ్య భీమా రూ.10 లక్షలు కల్పించాలి.అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలి. ట్యాబులు ఇచ్చి నెట్ సౌకర్యం కల్పించాలి. జీతాలు నేరుగా వీవోఏల అకౌంట్లలోనే వేయాలి.ఆన్‌లైన్ రిపోర్టులు, గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేయాలి. జీవో నంబర్ 58ను సవరించాలి. అభయ హస్తం డబ్బులను పొదుపు సంఘాలకు ఇవ్వాలి.ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ, "15 ఏళ్లుగా సేవ చేస్తున్నాం. అయినా కనీస వేతనం లేదు, ఉద్యోగ భద్రత లేదు. రూ.5,000తో కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షురాలు నిర్మల, కోశాధికారి సావిత్రి, పద్మ, శ్రీలక్ష్మి, సుబ్బమ్మ, నాగమణి, పాటు మండలంలోని 62 మంది వీవోఏలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన సర్పంచ్

**దమ్మపేట ,మే26 మహా** : మేజర్ గ్రామ పంచాయతీ లోని వివిధ కాలనీలలో నెలకొని ఉన్న డ్రైనేజీ సమస్యలను పంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు లు ,సెక్రటరి అనంత్ కుమార్ తో కలిసి పర్యవేక్షించారు. ప్రధమంగా అర్బన్ కాలనీలో ప్రజలు డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్న తీరును క్షేత్ర స్థాయి లో పరిశీలన చేసి అక్కడి వార్డు సభ్యులతో చర్చించారు. ముఖ్యంగా ఎగువన ఉన్న డ్రైనేజీ మురికి నీరు దిగువన ఉన్న ప్రదేశానికి వెళ్ళేందుకు అవకాశం లేకుండా గృహ నివాసీయులు కొందరు అడ్డుతగులుతున్నానని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. వెంటనే కార్యదర్శి స్పందించి అవసరమైన చోట , రహదారి కూడళ్ళలో మినీ సప్టాలు వేసి ,వరలతో నిర్మాణం చేసే పనులను వార్డు సభ్యులు రూపా రాంబాబుకు అప్పగించారు. ఎవరైనా అడ్డుకున్నట్లైతే తన దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాస్ ,నాయకులు రొయ్యల కుమార్ ,ఆరవ వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ ,కాంగ్రెస్ యువజన నాయకులు వనమాల శ్రీనివాసరావు , తిమ్మరాజు ప్రసాద్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మంగళపల్లిలో ఎమ్మెల్యే మల్ రెడ్డి సహకారంతో తీరిన నీటి విద్యుత్ కష్టాలు..

- గ్రామంలో నూతన పైప్లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు!
- ఎమ్మెల్యే రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు
- ఎస్సీ సెల్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక యాదగిరింధర్..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:మంగళపల్లి గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి, లోవోల్టేజ్ విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని చిలుక యాదగిరింధర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, మంగళపల్లి గ్రామంలో, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో, తాగునీటి పైప్లైన్, నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసి గ్రామంలో దీర్ఘంగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే రంగారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారని యాదగిరింధర్ తెలిపారు..

**గ్రామంలో లో వోల్టేజ్ కారణంగా అనేక ఇబ్బందులు....**

గత కొంతకాలంగా గ్రామంలో విద్యుత్ లోవోల్టేజ్ కారణంగా తాగునీటి బోర్లు సరిగ్గా నడవక, గ్రామస్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, యుద్ధప్రాతిపదికన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి, ఏర్పాటు చేయించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరా మెరుగుపడి, తాగునీటి మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. దీంతో మంగళపల్లి గ్రామలో నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయని అన్నారు. అడిగిన వెంటనే తమ సమస్యను ఆలకించి, పరిష్కరించిన ఎమ్మెల్యే మల్ రెడ్డికి, పెద్దలకు, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుక యాదగిరిధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్ బదిలీలకు మినహాయింపు ఇవ్వాలి

- జిల్లా అదనపు కలెక్టరుకు వినతి పత్రం అందజేత
- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్, అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:ఉద్యోగ బదిలీలలో ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్ కి మినహాయింపు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కిరణ్మయికి, జిల్లా పంచాయతీ అధికారికి సురేష్ మోహన్, జిల్లా వైద్యా అధికారి స్వర్ణ కుమారిలకు వినతి పత్రం అందజేసిన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ బృందం. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షు యశ్వంత్ మాట్లాడుతూ... ప్రభుత్వ జీఓ ప్రకారం ఉద్యోగ సంఘాలలో పనిచేసే ఆఫీస్ బేరర్ కి మినహాయింపు వర్తింప చేయాలని, వినతి పత్రం అందజేస్తూ పై అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ జీవో సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మాధవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వాణి (మహిళా విభాగం), గాయత్రి జాయింట్ సెక్రెటరీ (మహిళా విభాగం) సభ్యులు ఏ.మహేందర్, గౌస్, భిక్షపతి, శివకుమార్, శ్రీకాంత్, మల్లేశ్, బాషయ్య, వెంకటేష్, వెంకట్ రెడ్డి, మహేష్‌గౌడ్, శంకర్, రాజు గౌడ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్.. ప్రభుత్వ భూముల్లో అందిన కాడికి దోచేసిన షామీర్ పేట ఎమ్మార్వో

- ఓ ప్రైవేట్ వ్యక్తితో బేర సారాలు చేసి... కోట్లల్లో అక్రమ సంపాదన
- ఇంటలిజెన్స్ ఆరా తీస్తుందని తెలిసినా నాకేమి కాదనే ధీమా!
- జవహర్ నగర్ భూముల్లో జరిగిన అవినీతిపై లోతైన విచారణ జరగాలి
- అధికారులకు జవహర్ నగర్ పేద ప్రజల వేడుకోలు

**కుషాయిగూడ, మహా** : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని ఓ అవినీతి తిమింగలం ఏసీబీ అధికారుల వలకు చిక్కారు. పూర్వ కాప్రా తాసిల్దారుగా పనిచేసిన సుచరిత.. జవహర్ నగర్ ప్రభుత్వ భూములు అమ్మిన కాడికి దోచేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో కాప్రా ఎమ్మార్వో గా విధులు నిర్వహిస్తూ పేదల ఇండ్లు, గుడిసెలపై విరుచుకపడి పెద్దోళ్లకు అండగా నిలిచిందనే ఆరోపణలు బహిరంగంగానే ప్రజల్లో వినిపించాయి. మహిళా శక్తి భవన్ పేరుతో ప్రభుత్వ భూములను కేటాయించి, ఫెన్సింగ్ వేసి డబ్బులు దండుకోగానే మరోచోటికి మార్చేసి అక్కడ ఇదే తంతు జరిపి కోట్లల్లో అక్రమంగా సంపాదించింది అనేది అని ప్రజల ఆరోపణ... బుల్డోజర్లతో పేదల గుడిసెలను కూల్చితూ పెద్దోళ్లకు సలాం కొడుతుందనే కథనాలను అన్ని పత్రికల్లో ప్రచురితం అయిన విషయం విధితమే.. జవహర్ నగర్ కు ఇద్దరు గిర్దావర్లు, నలుగురు రెవెన్యూ సహాయకులు పనిచేసినా పట్టనట్టు ఓ ప్రైవేటు వ్యక్తిని కాప్రా ఎమ్మార్వో కార్యాలయంలో షాడో గా పెట్టుకొని అక్రమ సంపాదనకు తెరలేపిందని బాహాటంగానే ప్రజల యొక్క గుసగుస... సర్కారు భూముల్లో బోర్డులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేదని నాకెవ్వరు అడ్డు లేరు నేను చెప్పిందే వేదం చేసేది శాసనం అనేలా సుచరిత ప్రవర్తన ఉండేదని ప్రజల వాణి... అవినీతి తిమింగలాల వలలో చిక్కకుండా ఉండరని... చివరికు ఓ భూ వివాదంలో షామీర్పేట ఎమ్మార్వోగా పనిచేస్తూ మంగళవారం ఏసీబీకి చిక్కింది. పాపం ఏ రోజైనా పండక ఉండదని అక్రమ సంపాదన పై ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ చేయాలని జవహర్ నగర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మంగాపురం లో క్షుద్రపూజలు....!

**చేతబడి చేశారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**



నేలకొండపల్లి, మే 26 మహా: :అర్ధరాత్రి పసుపు, కుంకమ్మ.. నిమ్మకాయలు... నాటు కోడి...ఎర్రటి అన్నం ముద్దలు..ఇంట్లో నుంచి తాంత్రిక పూజలు... తమ కు చేతబడి చేశారని బాధితులు స్థానిక పోలీస్స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా లో తేజావత్ కళ్యాణిగిరి దంపతులకు గ్రామంలో ఓ మహిళ చేతబడి చేయించిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు మంత్రించిన నిమ్మకాయలు, పసుపు, కుంకమ, నల్లకోడి తో ఓ తాంత్రికుడు క్షుద్ర పూజలు చేశారు. గ్రామానికిచెందిన ఓ మహిళ కూసుమంచి మండలం లోని ఓ తాంత్రికుడు కు తమ . ఫోటోలు, మా వివరాలు అందించి వారికి చేతబడి 'చేయాలని... తాంత్రికుడు కు రూ.20 వేలు ను అందించినట్లు సమాచారం. ఈ మేరకు ఇటీవల తాంత్రికుడు పూజలు వినిపిస్తుండటంతో భయమేస్తోందని... తాంత్రికుడు చేతబడి విషయం ను వారి కి అనుకూలమైన, వారితో సన్నిహితంగా ఉన్న వ్యక్తి తమకు వివరాలు అందించారని ఫిర్యాదు లో పేర్కొన్నారు.

# తెలంగాణకు మణిహారంలా కోహెడ మార్కెట్

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే
- రైతులెవ్వరు ఆందోళన చెందవద్దు
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా**: అంతర్జాతీయ స్థాయిలో నిర్మించనున్న కోహెడ ఇటిగ్రేటెడ్ మార్కెట్ కు సీఎం రేవంత్ రెడ్డి జూన్ 3 న కోహెడలో శంకుస్థాపన చేయనున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తదితరలుకు ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం కలెక్టర్ నారాయణ రెడ్డి మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతిలతో కలిసి కోహెడలో జరిగే సీఎం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ 239 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించడం జరుగుతుందని, తెలంగాణకు మణిహారంలగా కోహెడ మార్కెట్ ఉంటుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అందరికీ నాయ్యం చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాల కోసం ప్రభుత్వం 239 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో 167/1లో సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపూర్ లో తాళ్ల గురజాల పోలీసుల తనిఖీలు

**... బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ ఆధ్వర్యంలో**



**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి మండలం తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం నాడు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరియైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తనిఖీలలో భూక్య రంజిత్ ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 20 లీటర్ల గుడుంబాను, బానోత్ నాగేష్ ఇంట్లో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. 1200 లీటర్ల గుడుంబాను తయారు చేసేందుకు నిలువ ఉంచిన బెల్లం పాలకమును మరియు ఇతర సామాగ్రిని గుర్తించిన పోలీసులు ధ్వంసం చేయడం జరిగింది. అనంతరం గ్రామంలో ని ఉద్దేశించి రూరల్ సిఐ హనుమంతు మాట్లాడుతూ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు వాహనాలను నడిపే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల గురుజాల ఎస్సై రామకృష్ణతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బుగ్గ దేవాలయ పూజారిని సస్పెండ్ చేయడం అనైతికం




**బెల్లంపల్లి ,మహా** :బెల్లంపల్లిమండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాచీన బుగ్గ దేవస్థానం పూజారి వేణుగోపాల శర్మను ఎండోమెంట్ అధికారులు సస్పెండ్ చేయడం అనైతికమని బెల్లంపల్లి పట్టణ 12 వ వార్డు కౌన్సిలర్ తిరుమల వాసు పేర్కొన్నారు. మంగళవారం టేకుల బస్తీ బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయం లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా బుగ్గ దేవాలయానికి కనీసం రోడ్డు సౌకర్యం లేని సమయం నుండి ఆలయ పూజారి వేణుగోపాలశర్మ బుగ్గ ఆలయంలో ధూప దీప నైవేద్యం సమర్పిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారని ఆయనకు ఆరోగ్యం బాగా లేక సోమవారం కాస్త ఆలస్యంగా రావడంతో ఆలయ ఈఓ అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని వెల్లడించారు. కేవలం ఉత్సవాల సమయంలో హాజరై ఆలయ ఆదాయాన్ని తీసుకెళ్లడం తప్ప ఆలయ అధికారులు బుగ్గ దేవాలయాన్ని ఏ మేరకు అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఆలయ పూజారి వేణుగోపాల శర్మ సస్పెన్షన్ ను ఎత్తివేసి తిరిగి విధుల్లో తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్లో మహిళ ఆత్మహత్యా యత్నం

**... అడ్డుకొని నివారించిన పోలీసులు**



**బెల్లంపల్లి, మహా** : బెల్లంపల్లి మండలం తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్లో భారతి అనే మహిళ తన ట్రాక్టర్ను దొంగిలించారని కేసు నమోదు చేయాలంటూ తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నం చేసుకోవడం చర్చనీయాంశం అయింది. వివరాల్లోకి వెళితే భారతీ అనే మహిళ గత కొద్ది రోజులుగా తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్లో తన ట్రాక్టర్ ను దొంగిలించారని కేసు నమోదు చేయాలని పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఇదివరకే మహిళకు అప్పు ఇచ్చిన వ్యక్తి ట్రాక్టర్ ను తీసుకువచ్చి పోలీస్ స్టేషన్లో అప్పగించడంతో పోలీసులు సంబంధిత వ్యక్తి వైపే మొగ్గుచూపుతూ కేసు నమోదు చేయకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి మంగళవారం నాడు పాల్పడగా అప్రమత్తమైన పోలీసులు నివారించి అడ్డుకున్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ట్రాక్టర్ విషయం లో కేసు నమోదు చేయాలని చోరీ కేసు విషయంలో నమోదు చేయాలని బలవంతం చేయడం జరిగిందని కానీ పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ట్రాక్టర్ ఉండడంతో చోరీ కేసును నమోదు చేయలేక పోయామని వివరించారు.

# సింగరేణిలో కార్మికుల నరకయాతన..

- ఓ వైపు భగ్గుమంటున్న ఎండలు..
- మరో వైపు ఊపిరాడనీయని దుమ్ము..
- డ్యూటీ వేళలు వెంటనే మార్చాలని సీఐటీయూ డిమాండ్..




**మణుగూరు, మహా** : మణుగూరు సింగరేణి ఏరియాలో తీవ్ర ఎండలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులు నరకయాతన అనుభవిస్తున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. పారిశ్రామిక ప్రాంతమైన మణుగూరులో ఉపరితల గనుల వద్ద ఉష్ణోగ్రతలు 48 నుంచి 50 డిగ్రీల వరకు నమోదవుతుండగా, మరోవైపు ఓసీ4లో వారం రోజులుగా వాటర్ స్ప్రేయింగ్ నిలిచిపోవడంతో గనులు దుమ్ముతో నిండిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒకపక్క మండుతున్న ఎండలు, మరోపక్క ఊపిరాడనీయని దుమ్ముతో కార్మికులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గనుల్లో దుమ్ము తీవ్రంగా వ్యాపించి కార్మికులు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వారం రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా స్థానిక కార్మిక సంఘాలు స్పందించకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రామిక భవన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం, బ్రాంచ్ అధ్యక్షుడు మాచారపు లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా డ్యూటీ సమయాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు.



# పాత నేరస్తులకు కౌన్సిలింగ్

**మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి**

**కుషాయిగూడ, మహా** : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం సిపి సుమతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ నేరాల అదుపులో కమిషనరేట్ ముందువరసలో నిలుచుందని తెలిపారు. యువత ముఖ్యంగా చెడు మార్గాలకు లోను కాకుండా సత్ప్రవర్తనతో జీవించి సమాజంలో ఉన్నతంగా నిలబడినప్పుడే దేశ గౌరవాన్ని ఇనుమడింప చేస్తామని తెలిపారు. భారతదేశం గొప్ప ప్రజాస్వామ్య దేశమని ఈ దేశానికి వెన్నెముక యువతేనని యువత మంచి మార్గంలో పయనించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి గంజాయి మత్తు తదితర పదార్థాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించి కుటుంబాలకు పేరు తేవాలని సూచించారు. అనంతరం పాత నేరస్తులను విడివిడిగా విచారించి తగిన కౌన్సిలింగ్లో సూచనలు చేసి వారిని సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కున్నతాధికారులు జవహర్ నగర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కారేపల్లి, మహా : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం గుంపెళ్ళగూడెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. గుంపెళ్ళగూడెంకు చెందిన సీతారాం(45) తన మోటర్ సైకిల్‌పై ఇల్లందు వెళ్ళి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద మోటర్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడి పోయాడు దీంతో తీవ్రగాయాలైన సీతారాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# పేదరాలి ఇంటికి సాయం

**ఔదార్యం చాటిన గుడిపుడి వెంకట్రావమ్మ ట్రస్ట్**

కారేపల్లి, మహా: నిరుపేదరాలైన వృద్ధురాలి ఇంటిని నిర్మించటానికి గుడిపుడి వెంకట్రావమ్మ ట్రస్ట్ ముందుకు వచ్చింది. కారేపల్లి మండలం గేటుకారేపల్లికి చెందిన నిరుపేద దళిత వృద్ధురాలు కాకాటి కళావతి ఇల్లు లేక అవస్థలు పడుతుంది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కట్టించుకోని పరిస్థితి ఉంది. విషయం తెలుసుకున్న గుడిపుడి వెంకట్రావమ్మ ట్రస్ట్ చైర్మన్ గుడిపుడి తిరుమలరావు వెంటనే వృద్ధురాలి కావల్సి ఇంటిని నిర్మాణం చేయటానికి ముందుకు వచ్చారు. రూ.40వేలతో రేకుల ఇంటిని నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా నిస్సహాయులను ఆదుకోవటం, యువతను చైతన్యవంతం చేసి చేడు అలవాట్ల కు దూరం ఉంచటమే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి ట్రస్ట్ ద్వారా పేద మహిళలు వేయి మందికి చీరలు పంపిణి చేశామని, యువతకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సహకారంతో మరింత సేవా కార్యక్రమాలు నిర్వహణకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు గుడిపుడి నర్సయ్య, గేటుకారేపల్లి ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు జక్కుల కుమార్, షేక్ హజేమియా, చెరుకూరి రామారావు, కాకాటి సుదర్శన్, సామినేని తిరుపతిరావు, మందా రామారావు, వల్లభినేని చంద్రశేఖర్, కాకాటి పృధ్వీ, బండ మల్లయ్య, పొట్లకాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత కంపెనీల లాభాలకు రిస్క్

## 200 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చు

### మరింతకాలం కొనసాగితే డిమాండ్‌పై ప్రభావం ..క్రిసిల్ రేటింగ్స్ అంచనా




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా ఏర్పడిన సరఫరా పరమైన అవరోధాలు మరింత కాలం పాటు కొనసాగితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత కంపెనీల లాభదాయకత 200 బేసిస్ పాయింట్లు (2 శాతం) తగ్గొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. కాకపోతే బలమైన బ్యాలన్స్ షీట్లు, దేశీ డిమాండ్ స్థిరంగా ఉండడం, ప్రభుత్వ మూలధన వ్యయాల మద్దతుతో భారత కంపెనీలు ఈ సమస్యలను ఎదుర్కొని బలంగా నిలుస్తాయని అంచనా వేసింది. 34 రంగాల్లోని సంస్థలు ఏ మాత్రం ఒత్తిళ్లను ఎదుర్కోగలవన్న దానిపై క్రిసిల్ రేటింగ్స్ ఒక అధ్యయనం చేసింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న పశ్చిమాసియా ఘర్షణ దేశీ కంపెనీలు తమ సరఫరా చైన్‌లను తిరిగి సమీక్షించుకోవడం, ధరల ఒత్తిళ్లను అధగమించడం, అధిక ఇంధన, రవాణా వ్యయాలను ఎదుర్కోవడం, కరిగిపోతున్న రూపాయి విలువను తట్టుకుని నిలబడేలా ప్రేరేపిస్తున్నట్టు వివరించింది. సంఘర్షణ ముగిసేందుకు, స్థిరీకరణకు ఎక్కువ కాలం పడితే, సరఫరా సమస్యలతో ద్రవ్యోల్బణం పెరిగిపోయి డిమాండ్‌పై ప్రభావం పడొచ్చని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సోమశేఖర్ వేమూరి పేర్కొన్నారు. కనుక ఘర్షణ స్థాయి, అది ఎంత కాలం పాటు కొనసాగుతుంది, చమురు ధరల పెరుగుదల ఎంత కాలం పాటు కొనసాగుతుందన్నది కీలకంగా చూడాల్సి ఉంటుందని.. ఇవన్నీ కంపెనీల క్రెడిట్ నాణ్యతను (రుణాలకు సకాలంలో చెల్లింపులు) ప్రభావం చేస్తాయని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సోమశేఖర్ వేమూరి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం మూడో నెలలోకి ప్రవేశించడం, ఇంకెంత కాలం కొనసాగుతుందో స్పష్టత లేకపోవడంతో కంపెనీలపై దీని ప్రభావాన్ని తెలుసుకునేందుకు క్రిసిల్ రేటింగ్స్ ఈ అధ్యయం చేయడం గమనార్హం.

#### తొమ్మిది నెలల పాటు సమస్యలే..

సరఫరా సమస్యలు తొమ్మిది నెలల పాటు కొనసాగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చమురు ధరలు బ్యారెల్‌కు సగటున 110 డాలర్ల స్థాయిలో కొనసాగొచ్చని పేర్కొంది. కనీసం 95 డాలర్ల స్థాయిలో ఉంటాయని తెలిపింది. ఆదాయ వృద్ధి కంటే ఖర్చులను నియంత్రించుకోవడం, లాభదాయకతను కాపాడుకోవడం కంపెనీలకు సవాళ్లుగా క్రిసిల్ రేటింగ్స్ ఎండీ సుబోధ్ రాయ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఎనిమిది రంగాల్లోని కంపెనీల రుణ నాణ్యత ప్రభావితం కావొచ్చని క్రిసిల్ అంచనా వేసింది. ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ గార్మెంట్స్, రొయ్యల ప్రాసెసర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీదారులు రూపాయి విలువ క్షీణతతో లాభపడొచ్చని తెలిపింది.

# కృత్రిమ మేధో ప్రవాహం.. ఉపాధికి శరాఘాతం!



సాంకేతికత ఎంత వేగంగా దూసుకుపోతున్నా మానవీయ విలువలను విస్మరిస్తే సమాజ సమతుల్యత దెబ్బతింటుందని వాటికన్ వేదికగా ప్రపంచ దేశాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. మే 25న వాటికన్ ఆడిటోరియంలో పోప్ లియో చారిత్రాత్మక ఎన్సైక్లికల్ (పోప్ అధికారిక పత్రం) 'మాగ్నిఫికా హ్యూమానిటాస్'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఏఐ పరిశోధనా సంస్థ ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకుడు క్రిస్టోఫ్ ఓలా పాల్గొని ఏఐ వల్ల భవిష్యత్తులో సంభవించబోయే ఉద్యోగ నష్టాలపై వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో పోప్ పక్కనే కూర్చున్న క్రిస్టోఫ్ ఓలా ఏఐ విస్తరణ వల్ల మానవ శ్రమకు పొంచి ఉన్న ముప్పును స్పష్టంగా వివరించారు.

#### భారీ స్థాయిలో ఉద్యోగాల కోత

కంప్యూటర్ కోడింగ్, కంటెంట్ రైటింగ్, డేటా అనలిటిక్స్, రోజువారీ ఆఫీస్ పనులను క్షణాల్లో పూర్తి చేయగల సరికొత్త ఏఐ సాధనాలను కంపెనీలు మార్కెట్లోకి వదులుతున్న తరుణంలో ఓలా వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'ఏఐ సాంకేతికత మానవ శ్రమను భారీగా భర్తీ చేసే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే ఉపాధి కోల్పోయి వీధిన పడే లక్షలాది మందికి సామాజిక, ఆర్థిక మద్దతు ఇవ్వడం ప్రపంచ దేశాల చారిత్రక, నైతిక బాధ్యత అవుతుంది' అన్నారు. సమాజాలు, ప్రభుత్వాలు ఊహించిన దానికంటే అత్యంత వేగంగా ఏఐ ఉపాధి రంగాలను పునర్నిర్మిస్తోందని, దీనికి అడ్డుకట్ట వేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

#### మాగ్నిఫికా హ్యూమానిటాస్

పోప్ లియో విడుదల చేసిన 'మాగ్నిఫికా హ్యూమానిటాస్' ఎన్సైక్లికల్ పూర్తిగా కృత్రిమ మేధస్సు యుగంలో మానవాళి ఉనికిని, హక్కులను రక్షించడంపైనే దృష్టి సారించింది. అదుపు లేని, వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి వల్లే ప్రస్తుత ఆధునిక సంక్షోభాలు మరింత తీవ్రమవుతున్నాయని ఈ పత్రంలో పోప్ హెచ్చరించారు.

#### ఎన్సైక్లికల్‌లోని ముఖ్యమైన అంశాలు

లగ్జరీగా మారిన ఏఐ కంపెనీలపై ప్రభుత్వాలు కఠినమైన నియంత్రణను కలిగి ఉండాలి. డిజిటల్ ప్రపంచంలో కేవలం కొన్ని సంస్థల చేతుల్లోనే అధికారం ఏకీకృతం కావడం సమాజానికి శ్రేయస్కరం కాదు. ఏఐ అనేది కేవలం సాంకేతిక ఆవిష్కరణ లేదా వ్యాపార సమస్య కాదు, అది నేరుగా మానవ జీవితాలను ప్రభావితం చేసే నైతిక అంశం.

#### ఒత్తిడిలో ఏఐ సంస్థలు

ప్రస్తుతం ఫ్రాంటీర్ ఏఐ ల్యాబ్‌లు ఎదుర్కొంటున్న వాణిజ్యపరమైన సవాళ్లను కూడా క్రిస్టోఫ్ ఓలా ఈ సందర్భంగా ప్రస్తావించారు. తీవ్రమైన వ్యాపార పోటీ, భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు, వ్యక్తిగత ఆశయాల నడుమ ఈ కంపెనీలు పనిచేస్తున్నాయని ఆయన అంగీకరించారు. తీవ్రమైన అంతర్జాతీయ వాణిజ్య పోటీ వల్ల నైతిక విలువల కంటే లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. దాంతో సాంకేతికత దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మంచి ఉద్దేశాలు ఉన్న పరిశోధకులు సైతం మార్కెట్ శక్తుల ఒత్తిడికి లొంగిపోక తప్పడం లేదని పేర్కొన్నారు. అందుకే ఏఐ సంస్థలపై విమర్శలు, పారదర్శకమైన బహిరంగ పరిశీలన అత్యంత అవసరమని ఓలా స్పష్టం చేశారు.

# లేఆఫ్స్‌కు సాకు చెప్పడం సీఈఓల సోమరితనం



టెక్ ప్రపంచంలో కొంతకాలంగా సాగుతున్న ఉద్యోగాల కోత (లేఆఫ్స్)పై కృత్రిమ మేధ (ఏఐ) దిగ్గజం, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీల్లో జరుగుతున్న ఉద్యోగాల తొలగింపునకు ఏఐ సాంకేతికతను సాకుగా చూపించడాన్ని ఆయన తప్పుపట్టారు. కొంతమంది టెక్ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి, కేవలం స్మార్ట్‌గా కనిపించడానికి ఏఐని వాడుకుంటున్నారని ఇది వారి సోమరితనం(లేజీ నారేటివ్) అని మండిపడ్డారు. ఇటీవల ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హువాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**రెండేళ్ల క్రితం తీసేసి.. ఇప్పుడు ఏఐ అనడం ఏంటి?**

ఉద్యోగ నష్టాలకు, ఏఐ విస్తరణకు ముడిపెడుతూ సాగుతున్న ప్రచారాన్ని జెన్సెన్ హువాంగ్ పూర్తిగా ఖండించారు. సాంకేతికత ఇప్పుడిప్పుడే వ్యాపారాలకు ఉపయోగకరంగా మారుతోందని, కానీ కంపెనీలు మాత్రం చాలా కాలం క్రితమే ఉద్యోగులను తొలగించాయని ఆయన గుర్తుచేశారు. 'ఏఐ అనేది కేవలం గత ఆరు నెలలుగా మాత్రమే పూర్తిస్థాయిలో ఉత్పాదకతను ఇస్తూ కంపెనీలకు ఉపయోగకరంగా మారింది. మరి అలాంటప్పుడు రెండేళ్ల క్రితమే ఉద్యోగులను తొలగించిన కంపెనీలు.. దానికి ఏఐ కారణమని ఎలా చెబుతాయి? టెక్నాలజీ ఇప్పుడే మార్కెట్లోకి వస్తే.. అప్పుడే ఉద్యోగాలు ఎలా పోతాయి? నేను ఈ ధోరణిని తీవ్రంగా ద్వేషిస్తున్నాను' అని హువాంగ్ అన్నారు. కొంతమంది వ్యాపార నాయకులు శ్రామిక శక్తిని తగ్గించుకోవడానికి ఉన్న అసలైన అంతర్గత కారణాలను దాచిపెట్టి కేవలం చర్చనీయాంశంగా మార్చడానికి ఏఐని ఒక అస్త్రంగా వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.

**భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్యం**

ప్రస్తుతం మెటా, గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలు ఒకవైపు ఏఐ ప్రాజెక్టుల్లో భారీగా పెట్టుబడులు పెడుతూనే.. మరోవైపు వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో మానవ కార్మికులను ఏఐ పూర్తిగా రీప్లేస్ చేస్తుందేమోనన్న ఆందోళనను ఉద్యోగుల్లో పెంచుతున్నాయి. ఈ అంశంపై హువాంగ్ స్పందిస్తూ.. కార్పొరేట్ నాయకులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. 'మనం అనవసరంగా ప్రజలను భయపెడుతున్నాం, ఇది చాలా బాధ్యతారాహిత్యం. ఏఐ చుట్టూ ఉన్న వాస్తవాలను, దానివల్ల కలిగే సమతుల్య ప్రయోజనాలను సమాజానికి వివరించడంపై పరిశ్రమ దృష్టి పెట్టాలి' అని ఆయన స్పష్టం చేశారు.

**పీక్ స్టేజ్‌లో ఉద్యోగాల కోత: గణంకాలు ఏం చెబుతున్నాయి?**

ఉత్పాదకతను పెంచడానికి, పనులను ఆటోమేట్ చేయడానికి పరిశ్రమలు ఏఐ సాధనాలను వేగంగా స్వీకరిస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ లేఆఫ్స్‌కు కేవలం అదే కారణం కాదని మార్కెట్ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. టెక్ పరిశ్రమలో ఉద్యోగాల కోతలను ట్రాక్ చేసే 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' తాజా గణాంకాల ప్రకారం.. 2026లో ఇప్పటివరకు 150 టెక్ కంపెనీల్లోని 1,14,210 మందికి పైగా ఈ లేఆఫ్స్ ద్వారా ప్రభావితమయ్యారు. మొత్తమ్మీద, లేఆఫ్స్ వెనుక ఉన్న ఆర్థిక మాంద్యం భయాలు, కంపెనీల మితిమీరిన విస్తరణ, వ్యయాల తగ్గింపు వంటి అసలు కారణాలను పక్కనబెట్టి ప్రతిదానికీ సరికొత్త టెక్నాలజీ వైపు వేలెత్తి చూపడం సరికాదన్న ఎన్విడియా చీఫ్ వ్యాఖ్యలు ఇప్పుడు టెక్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# బక్రీద్ వేళ.. 40% పెరిగిన మేకల ధరలు

**న్యూఢిల్లీ:** బక్రీద్ పండుగ(మే 28) సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా బకరా మండీలలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన రవాణా ఖర్చులు, భారంగా మారిన మేత ధరలు, పండుగ గిరాకీ కారణంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మేకల ధరలు 20 శాతం నుండి 40 శాతం వరకు పెరిగాయి. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ తదితర ప్రధాన నగరాల్లోని మార్కెట్లలో కొనుగోలుదారుల రద్దీ విపరీతంగా ఉండగా, ప్రత్యేక జాతి మేకల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడానికి కూడా కొందరు వెనుకాడటం లేదు.

#### ధరల పెరుగుదలకు అసలు కారణాలు

ప్రధాన నగరాల్లోని బకరా మండీలలో ధరలు భారీగా పెరగడానికి పలు కారణాలున్నాయి. పశువుల రవాణాకు అయ్యే ఖర్చులు, డీజిల్ ధరలు, పశుగ్రాసం ఖర్చులు విపరీతంగా పెరగడం వ్యాపారులపై భారాన్ని పెంచింది. వీటితో పాటు పండుగ సమయంలో పెరిగిన డిమాండ్, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రత్యేక జాతి మేకలపై పెరిగిన క్రేజ్ కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. మే 28న జరగనున్న బక్రీద్ కోసం మేకల కొనుగోలుదారులు మార్కెట్ల ముందు బారులు తీరుతున్నారు.

#### మేకల కేటగిరీలు.. ధరలు

సాధారణంగా 2025 కిలోల బరువుండే చిన్న రకం మేకలు 11,000 నుండి 25,000 రూపాయల మధ్య లభిస్తున్నాయి. మధ్య తరహా (3050 కిలోలు) మేకలకు 20,000 నుండి 50,000 రూపాయల వరకు ధర పలుకుతోంది. అయితే సోజాత్, బీతల్ వంటి ప్రీమియం జాతులు మాత్రం 55,000 నుండి లక్ష రూపాయల పైన ధరలు పలుకుతున్నాయి. ప్రత్యేక రకపు జాతికి చెందిన భారీ బరువుండే మేకలు ఏకంగా 1.5 లక్షల నుండి 3.5 లక్షల రూపాయల వరకు అమ్ముడవుతున్నాయి.

#### కొనుగోలుదారులకు సూచనలు

పండుగ వేళ మేకల కొనుగోలులో మోసపోకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. వ్యాపారులు మొదట చెప్పే ధరలలో 20 శాతం నుండి 30 శాతం వరకు బేరమాడే అవకాశం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. వీలైతే 'లైవ్ వెయిట్' (బరువుకు తగిన ధర) పద్ధతిలో మేకలను ఎంచుకోవడం మంచిది. అలాగే, ఖుర్బానీ కోసం కొనే పశువులకు సంబంధించిన టీకా రికార్డులను, వాటి ఆరోగ్య పరిస్థితిని పశువైద్యుల సహాయంతో లేదా అనుభవజ్ఞుల ద్వారా సరిచూసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# సజావుగానే శాంతి ఒప్పందం చర్చలు



**వాషింగ్టన్/న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా ఇరాన్‌తో చర్చలు సజావుగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం చెప్పారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టుచేశారు. ఇరాన్‌తో శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు.. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, భద్రతా సంబంధాలను నెలకొల్పే అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని సూచించారు. ఆ ఒప్పందాలపై ఇరాన్ కూడా సంతకం చేయడం గౌరవంగా ఉంటుందని వెల్లడించారు. అత్యంత సంక్లిష్టమైన చిక్కుముడిని విడదీయడానికి అమెరికా కృషి చేస్తోందన్నారు. చర్చల్లో పాల్గొంటున్న దేశాలు ఏకకాలంలో అబ్రహం ఒప్పందాలపై సంతకం చేయడం తప్పనిసరి కావాలని ఆకాంక్షించారు. ఒకరిద్దరు సంతకాలు చేయకపోవడానికి తగిన కారణం ఉంటే అంగీకరించవచ్చని తెలిపారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య శాంతి చర్చల్లో యూఏఈ, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్తాన్, తుర్కియే, ఈజిప్టు, జోర్డాన్ భాగస్వామిగా కొనసాగుతున్నాయి. అయితే, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు అబ్రహం ఒప్పందాలపై ఇప్పటికే సంతకాలు చేశాయి. మిగిలిన దేశాలు కూడా అదే బాటలో నడవాలని ట్రంప్ కోరుకుంటున్నారు.

**ఖమేనీ నుంచి ప్రతిస్పందన ఆలస్యం**

ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ ప్రస్తుతం ఎక్కడున్నారో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఆయన గుర్తు తెలియని ప్రాంతం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటారు. ఆయనను కలుసుకోవడం ఇరాన్‌లోని అత్యంత ముఖ్యులకు తప్ప ఇతరులకు సాధ్యపడదు. శాంతి చర్చల విషయంలో అమెరికా ప్రతిపాదనలను మొజ్తబా ఖమేనీకి చేరవేయడం, ఆయన నుంచి ప్రతిస్పందన రావడానికి చాలా సమయం పడుతోందని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. అందుకే శాంతి ఒప్పందం ఖరారు కావడం ఆలస్యమవుతోందని అంటున్నారు. ఒప్పందం ముసాయిదాను ఖమేనీ దాదాపు అంగీకరించారని సీనియర్ పరిపాలనా అధికారి ఒకరు చెప్పారు. రాబోయే కొద్ది రోజుల్లో ఇరాన్ నుంచి తుది నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. చాలామంది ఇరాన్ నాయకులు పగటి వెలుగు చూడకుండా, వారాల తరబడి అత్యంత పటిష్టమైన బంకర్లలో గడుపుతూ, అవసరమైతే తప్ప ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదని అమెరికా మీడియా వెల్లడించింది.

**చర్చల్లో గణనీయమైన పురోగతి: రూబియో**

హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సోమవారం చెప్పారు. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాగ్రత్తతో కూడిన వైఖరిని అవలంబిస్తున్నారని, చెడ్డ ఒప్పందాన్ని ఆయన అంగీకరించబోరని తేల్చిచెప్పారు. చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.


**ఒప్పందం అత్యవసరమేమీ కాదు: ఇరాన్**

అమెరికాతో ఇప్పటికిప్పుడు శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం అత్యవసరమేమీ కాదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బాఖై స్పష్టంచేశారు. చర్చలో ఉన్న చాలా అంశాలపై ఒక ముగింపునకు వచ్చామని చెప్పడం సరైనదే అవుతుందన్నారు. అయితే, దీని అర్థం ఒప్పందంపై సంతకాలు త్వరలో జరగబోతున్నాయని చెప్పడం కాదని ఉద్ఘాటించారు. అమెరికా, ఇరాన్‌లు ఇప్పటికే ఈ అవగాహనా ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. ఇందులో 60 రోజులపాటు కాల్పుల విరమణ, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమంపై తదుపరి చర్చల ప్రణాళిక వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం.



# అమెరికాలో భారతీయ మహిళ హత్య

అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ స్టోర్‌లో గుజరాత్‌కు చెందిన భారతీయ మహిళ హత్యకు గురయ్యారు. మృతురాలిని బిజాపూర్ ప్రాంతంలో మెహసానా జిల్లా జంత్రాల్ గ్రామానికి చెందిన మేఘనా పటేల్‌గా గుర్తించారు. మేఘ్నా పటేల్ తన కుటుంబంతో కలిసి అమెరికాలో స్థిరపడ్డారు. దుకాణం (స్టోర్) లోపల దుండగుడు ఆమెపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. ఆ వీడియోలో ఓ వ్యక్తి కస్టమర్ తరహాలో దుకాణంలోకి ప్రవేశించడం కనిపించింది. ట్రాక్‌సూట్, జాకెట్, గ్లోవ్స్ , ఫేస్ మాస్క్ టోపీ ధరించి ఉన్న ఆ వ్యక్తి.. మేఘ్నా పటేల్‌తో కొద్దిసేపు మాట్లాడిన సెకన్ల వ్యవధిలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత అతను టేబుల్ పైనుంచి ఏదో తీసుకుని అక్కడి నుంచి పారిపోవడం కనిపించింది. ఈ కాల్పులు దోపిడీ ఉద్దేశంతోనే జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# చిలీలో తీవ్ర భూకంపం

**శాంటియాగో:** నిన్న మధ్యాహ్నం ఉత్తర చిలీలోని అంటో ఫాగస్టా ప్రాంతంలో తీవ్ర భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.8గా నమోదైంది. యూనివర్సిటీ ఆఫ్ చిలీకి చెందిన నేషనల్ సీస్మోలాజికల్ సెంటర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కాలమానం సాయంత్రం 5:52 గంటలకు ఈ భూకంపం వచ్చిందని కలామా నగరానికి దక్షిణంగా 12 కిలోమీటర్ల దూరంలో భూమి కంపించినట్లు ఆ దేశ మీడియా పేర్కొంది. అయితే ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ భూకంపంలో ఇప్పటి వరకూ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగనట్లు తెలుస్తోంది. చిలీ దేశం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన భూకంప ప్రాంతమైన "పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్"లో ఉంది. ఈ భౌగోళిక కదలికల వల్లే చిలీలో నిరంతరం తీవ్రమైన భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. చిలీ ప్రాంతం ఇప్పటి వరకూ దాదాపు 100కు పైగా భారీ భూకంపాలను ఎదుర్కొంది.

## టీఎఫ్‌సీసీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి: చిరంజీవి



''తెలుగు చిత్ర పరిశ్రమకి 'తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్' (టీఎఫ్‌సీసీ) అన్నది హయ్యెస్ట్ బాడీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. థియేటర్స్‌లో పర్సెంటేజీ విధానంపై నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఒక నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మీడియా ముందు ఏ ఒక్కరూ తమ అభిప్రాయాలు వ్యక్తపరచటం తగదు. ఇలాంటివాటి వల్ల ఇండస్ట్రీ ఒక్కటిగా లేదన్న సందేశం ఇవ్వకూడదు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండటం అందరికీ సముచితం'' అని హీరో చిరంజీవి తెలిపారు. మల్టీప్లెక్స్‌లోలా సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో కూడా పర్సెంటేజీ విధానం అమలు చేయాలంటూ ఎగ్జిబిటర్స్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో నెలకొన్న సంక్షోభాన్ని తెలుగు సినీ పరిశ్రమ పెద్దలు సోమవారం చిరంజీవిని కలిసి, వివరించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ– ''తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్'(టీఎఫ్‌సీసీ) ఇంతకు ముందు వేసిన వేరే కమిటీల పనితీరు, ఫలితాల పట్ల కొందరు ఎగ్జిబిటర్స్‌లో అసంతృప్తి, అపనమ్మకం ఉందన్న విషయం అర్థం అయింది. ఫిల్మ్ చాంబర్ కమిటీ జూన్ 30వ తేదీ వరకూ అన్ని విషయాలను పూర్తిగా పరిశీలించి,ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అందరికీ న్యాయం జరిగేలా పర్సెంటేజీ మోడల్ మీద ప్రతిపాదనని చేస్తుందనే నమ్మకం నాకు ఉంది. కమిటీ సకాలంలో నివేదిక ఇవ్వటానికి నా వంతు ప్రయత్నం చేస్తాను'' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సురేష్‌బాబు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'దిల్' రాజు, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు శేఖర్, నిర్మాతలు అల్లు అరవింద్, కేఎల్ నారాయణ, సునీల్ నారంగ్‌తో పాటు భరత్ నారంగ్, అనుపమ్, శ్రీధర్, సదానంద్ గౌడ్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## 'బాహుబలి' గురించి తమన్నా షాకింగ్ కామెంట్స్

తెలుగు సినిమా చరిత్ర గతిని మార్చిన సినిమాల్లో 'బాహుబలి' ఒకటి. ప్రభాస్, రాజమౌళి లాంటి వాళ్లతో పాటు తమన్నా లాంటి హీరోయిన్లని గర్వపడేలా చేసింది. పాన్ ఇండియా గుర్తింపు దక్కేందుకు కారణమైంది. ఈ మూవీలో వీరోచిత నారీ అవంతికగా తమన్నా అదరగొట్టేసిందని చెప్పొచ్చు. అయితే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమన్నా.. 'బాహుబలి' గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'గత కాలాన్ని ఇప్పుడు గుర్తు చేసుకుంటుంటే 'బాహుబలి' కోసం తీసుకున్న ప్రతి నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. అప్పట్లో ఒక ప్రాంతీయ భాషా చిత్రాన్ని రూ. 200 కోట్లు ఖర్చు పెట్టి తీయడమనేది ప్రమాదకరమైన ప్రయత్నమే. ఎందుకంటే ఒకవేళ వ్యాపార పరంగా అటూ ఇటూ అయితే అందులోంచి బయటపడటం అనేది కష్టం. భారీ నష్టం వాటిల్లేది. దర్శకుడు రాజమౌళి దూరదృష్టి, ఏ విషయంలోనూ రాజీపడని తత్వం, ధృఢమైన నమ్మకమే 'బాహుబలి'ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టింది. అనూహ్య విజయానికా కారణమైంది. బాహుబలి రెండు భాగాలు వ్యాపార పరంగా అత్యధిక వసూళ్లు సాధించాయి. అలానే ఇండస్ట్రీలోని మిగతా దర్శక నిర్మాతల్లో నమ్మకాన్ని కలిగించాయి. ఆ తర్వాత పలు ప్రాంతీయ భాషా చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో రూపొంది విజయాలను అందుకుంటున్నాయి' అని తమన్నా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీ.. తమిళంలో విశాల్‌కు జంటగా 'మకుటం' సినిమా చేస్తోంది. అలానే హిందీలోనూ పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## వివాదంలో రణ్‌వీర్ సింగ్

### ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నాన్–కోపరేషన్ ఆదేశం

రణ్‌వీర్ సింగ్ వివాదంలో చిక్కుకున్నారు. దానికి కారణం 'డాన్ 3' సినిమా. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా 2023లో 'డాన్ 3' సినిమా ప్రకటన వచ్చింది. రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటివరకూ ఈ సినిమా సెట్స్‌కు వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి రణ్‌వీర్ సింగ్ సడన్‌గా తప్పుకోవడం వివాదమైంది. దీంతో దాదాపు రూ. 45 కోట్ల నష్టం వాటిల్లిందని ఫర్హాన్ అక్తర్ ఆరోపించి, 'ది ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ)కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్ అశోక్ పండిట్ మాట్లాడుతూ– "రణ్‌వీర్ సింగ్ వల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలని ఏప్రిల్ 10న ఫర్హాన్ అక్తర్ ఫిర్యాదు చేశారు.

మరో మూడు వారాల్లో 'డాన్ 3'ప్రారంభమవ్వాల్సిన సమయంలో రణ్‌వీర్ ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. దాదాపు 200మంది వర్కర్స్‌కు హోటల్ బుకింగ్స్, ట్రావెల్ ప్లాన్, లొకేషన్ బుకింగ్ వంటివాటికి ఫర్హాన్, రితేష్ ఖర్చు చేశారు. అలాగే ఫర్హాన్ నిర్మాణ సంస్థ అయిన ఎక్సెల్ ఎంటర్టైన్మెంట్‌తో మూడు సినిమాలు చేసేందుకు రణ్‌వీర్ కాంట్రాక్ట్ చేసుకున్నారు. స్క్రిప్ట్ వర్క్ ఆయన సమక్షంలోనే జరిగింది. రణ్‌వీర్ సింగ్‌ను తన తరఫు వాదనలు వినిపించాలని మూడు నోటీసులు పంపాం. కానీ స్పందన లేదు" అని తెలిపారు. "ఎంతటి సూపర్ స్టార్ హీరో అయినా చట్టం ముందు గొప్ప కాదని మేం ఇండస్ట్రీకి చెప్పాలనుకుంటున్నాం. రణ్‌వీర్ సింగ్ వచ్చి, మమ్మల్ని కలిసేంత వరకు ఆయనపై సహాయ నిరాకరణ కొనసాగుతుంది" అని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ అధ్యక్షుడు బీఎన్ తివారి తెలిపారు.

### హుందాగా పరిష్కరించుకోవాలి: రణ్‌వీర్

ఈ నేపథ్యంలో "ఈ తరహా విషయాలను పరిణతితో, పరస్పర గౌరవంతో పరిష్కరించుకుంటే బాగుంటుంది. 'డాన్' ఫ్రాంచైజీతో సంబంధం ఉన్నవారితో సహా, చిత్ర పరిశ్రమలోని అందరి పట్ల మా నటుడికి అత్యంత గౌరవం ఉంది" అంటూ రణ్‌వీర్ సింగ్ తరపున ఆయన అధికార ప్రతినిధి ఓ లేఖ విడుదల చేశారు. అందులోని సారాంశం ఈ విధంగా... "డాన్ 3'కి సంబంధించి ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఆయన (రణ్‌వీర్) మౌనంగా ఉండాలనుకున్నారు. వృత్తికి సంబంధించిన చర్చలు, వ్యక్తిగత అనుబంధాలకు సంబంధించిన విషయాలను హుందాగా, పరిణతితో పరిష్కరించుకోవాలి. అయితే ఈ మధ్య పలు ఊహాగానాలు నెలకొనడంతో రణ్‌వీర్ స్పందించాలనుకున్నారు. ఆయన ఫోకస్ మొత్తం ప్రస్తుత కమిట్‌మెంట్స్, చేసే పని మీద మాత్రమే ఉన్నాయి" అన్నది ఆ లేఖ సారాంశం. అలాగే "ఈ చిత్రంతో అసోసియేట్ అయిన అందరి మీదా ప్రగాఢమైన గౌరవం, సానుకూలత ఉన్నాయి. ఈ 'డాన్' ఫ్రాంచైజీ తన విజయాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాను" అని కూడా రణ్‌వీర్ పేర్కొన్నారు.



## అలా చేస్తే సగం రోజుల్లోనే సన్నబడిపోతారు

సాధారణ ప్రజలు నచ్చినవి నచ్చినట్లు తినేస్తుంటారు కానీ సినిమా సెలబ్రిటీలకు ఇలాంటివి కుదరదు. మూవీల్లో చేసే పాత్ర కోసం పక్కా డైట్ మెంటైన్ చేస్తూ బాడీ ఫిట్‌గా ఉండేలా చూసుకుంటూ ఉంటారు. జాన్వీ కపూర్ కూడా ఇప్పుడు అలాంటి ఓ బెస్ట్ వెయిట్ లాస్ టిప్ చెప్పింది. 'పెద్ది' చిత్రం ప్రమోషన్లలో భాగంగా ఈ విషయాన్ని పంచుకుంది. జూన్ 4న థియేటర్లలోకి రాబోతున్న సినిమా 'పెద్ది'. రామ్ చరణ్ హీరో కాగా జాన్వీ కపూర్ హీరోయిన్. కొన్నిరోజుల క్రితం ముంబైలో ట్రైలర్ లాంచ్ చేయగా.. రీసెంట్‌గా భోపాల్‌లో ఐటమ్ గీతాన్ని ఆవిష్కరించారు. సోమవారం బెంగళూరులోని మరో ఈవెంట్ చేశారు. ఈ కార్యక్రమంలోనే హీరోయిన్ జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. 'రామ్ చరణ్ సర్‌తో ఓ పాటలో గనక మీరు డ్యాన్స్ చేయడానికి ప్రయత్నిస్తే సగం రోజుల్లోనే బక్కగా అయిపోతారు' అని చెప్పుకొచ్చింది. జాన్వీ ఇలా చెబుతున్నప్పుడు ఎదురుగా కూర్చుని ఉన్న రామ్ చరణ్ సిగ్గు పడిపోతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. 'పెద్ది' చిత్రాన్ని స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించారు. ఇందులో చరణ్.. క్రికెటర్, రెజ్లర్, రన్నర్‌గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే వచ్చిన ట్రైలర్ కొందరిని మాత్రమే ఆకట్టుకుంది. మాస్ మూమెంట్స్ కంటే స్టోరీని చూపించడంతో కొందరు ఫ్యాన్స్ డిసప్పాయింట్ అయ్యారు. ఐటమ్ సాంగ్‌కి కూడా మిశ్రమ స్పందనే వచ్చింది.



## సీఎం విజయ్.. ఇండస్ట్రీకి కలిసొచ్చే సరికొత్త నిర్ణయం

హీరో విజయ్.. తమిళనాడు ముఖ్యమంత్రి అయిపోయారు. ప్రస్తుతం పాలనలో బిజీగా ఉన్నారు. అయితే ఈయన స్వతహాగా నటుడే కాబట్టి ఇండస్ట్రీకి అనుకూలించే నిర్ణయాలు తీసుకుంటారని సినీ ప్రముఖులు అంతా భావించారు.

ఎవరికి వాళ్లే పలు సూచనలతో విజయ్‌ని ఇదివరకే వెళ్లి కలిశారు కూడా. ఇప్పుడు సినీ పరిశ్రమకు మొత్తానికి కలిసొచ్చేలా విజయ్ శుభవార్త చెప్పేశారు. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం విజయ్.. ఇండస్ట్రీ గురించి ప్రకటన చేశారు. ఇకపై ఏ తమిళ సినిమా అయినా థియేటర్లలో రోజుకు 5 షోలు ప్రదర్శించుకోవచ్చని పేర్కొన్నారు. 1957 తమిళనాడు థియేటర్ల నియంత్రణ చట్టం నిబంధనలను సవరిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం తమిళనాడు వ్యాప్తంగా అన్ని థియేటర్లలో కొత్తగా విడుదలయ్యే తమిళ సినిమాలు విడుదలైన రోజు నుంచి వారం రోజుల పాటు రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకోవచ్చు. స్థానిక పండగ రోజులు, ప్రభుత్వ సెలవు దినాలు, శని,ఆదివారాల్లో కూడా రోజుకు ఐదు ఆటలు ప్రదర్శించడానికి అనుమతి లభించింది. గత కొన్నేళ్లలో తమిళనాడులో ఏ కొత్త సినిమా అయినా సరే మార్నింగ్ షోతోనే మొదలయ్యేది. బెన్‌ఫిట్ షోలు లాంటివి ఉండేవి కావు. ఇప్పుడు సీఎం విజయ్ తీసుకున్న నిర్ణయం వల్ల స్టార్ హీరోల చిత్రాలకు కలెక్షన్స్ పరంగా కలిసొచ్చే అవకాశముంటుంది. అలానే తెలుగు రాష్ట్రాల్లో ముందురోజు రాత్రి వేసే ప్రీమియర్ల ట్రెండ్ కూడా త్వరలో తమిళనాడులో మొదలైన ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇకపోతే విజయ్ నటించిన చివరి సినిమా 'జన నాయగణ్' రిలీజ్ ఎప్పుడనేది ఇంకా తేలట్లేదు. కొన్నిరోజుల క్రితం తమిళనాడులోని ఓ ఆలయాన్ని దర్శించుకున్న ఈ చిత్ర నిర్మాత వెంకట్ కె నారాయణ.. ఇంకా సెన్సార్ కాలేదని చెప్పారు. మరోవైపు జూన్ 19న మూవీ థియేటర్లలోకి వచ్చే అవకాశముందని మాట్లాడుకుంటున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే రోజుకు ఐదు షోల నిర్ణయం.. 'జన నాయగణ్'కి ఎక్కువగా లాభించే అవకాశముంటుంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com